

4 లో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మహిళలు ఆషాఢ సారె

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7569677170



ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :238 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శుక్రవారం 24 జులై 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad


# విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టం

విద్యార్థుల భవిష్యత్తే అత్యంత ముఖ్యమన్న మోదీ

పేపర్ లీక్ కేసులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన

వేగవంతమైన విచారణ, కఠిన శిక్షలకు ఆదేశాలు

విద్యార్థుల ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయమన్న ప్రధాని

దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో స్పందించిన ప్రధాని



**న్యూఢిల్లీ:** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. విద్యార్థుల సంక్షేమం, వారి భవిష్యత్తు కంటే ముఖ్యమైనది ఏదీ లేదని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీలకు పాల్పడే వారిపై వేగంగా, కఠినంగా చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ మేరకు గురువారం 'ఎక్స్' వేదికగా చేసిన పోస్టులో.. పేపర్ లీక్ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తై నిందితులకు కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మిగతా 2లో...

# యువత భవిష్యత్తుకు హాని చేసిందే మీరు..



ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ కౌంటర్

విద్యా వ్యవస్థను కేంద్రం ధ్వంసం చేసిందని ఆరోపణ

ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్

విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని పట్టు

ఆందోళనకారులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**న్యూఢిల్లీ:** యువత భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టబోమంటూ నీట్ పేపర్ లీక్‌పై స్పందించిన ప్రధాని మోదీ వ్యాఖ్యలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. దేశ యువత భవిష్యత్తుకు హాని చేసిందే మీరంటూ ఘాటు విమర్శలు గుప్పించారు. ఈ మేరకు గురువారం 'ఎక్స్' వేదికగా స్పందించిన లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్.. దేశ విద్యా వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆరోపించారు. ఇందుకు బాధ్యులైన వారిని రక్షించిందని పేర్కొన్నారు. విద్యార్థుల డిమాండ్లు స్పష్టంగా ఉన్నాయని రాహుల్ పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు ప్రభుత్వం బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, జంతర్‌మంతర్‌లో ఆందోళన చేసిన విద్యార్థులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నీట్ పేపర్ లీక్ కేసుల్లో వేగవంతమైన విచారణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని అంతకుముందు మోదీ ప్రకటించారు. యువత భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టబోమని పేర్కొన్నారు. మోదీ ప్రకటన వెలువడిన కాసేపటికే రాహుల్ గాంధీ పై వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఢిల్లీ పోలీసులకు ఎన్‌ఎస్‌ఏ అధికారాలు..

సీజేపీ ఆందోళనల వేళ సర్వత్రా ఉత్కంఠ

ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు ఎన్‌ఎస్‌ఏ కింద నిర్బంధ అధికారాల పునరుద్ధరణ

ఇది రొటీన్ ప్రక్రియే, సీజేపీ నిరసనలకు సంబంధం లేదన్న పోలీసులు

పరీక్షల అవకతవకలపై కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనలు ఉద్ధృతం

జసెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవల నిలిపివేత



# ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఏపీ

భూ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి

భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా మీ భూమి-బ్లాక్ చెయిన్

ట్యాంపర్ చేయలేని విధంగా ల్యాండ్ రికార్డులకు హై సెక్యూరిటీ

మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, సింధూరదర్శిని:** ప్రక్షాళన-విముక్తి-భద్రత అంశాలుగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని సీఎం తెలిపారు. దీనికి అనుగుణంగానే భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టును తెచ్చామని సీఎం చంద్రబాబు చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలెట్ ప్రాజెక్టును వర్చువల్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ మేరకు ఈ ప్రాజెక్టులో ఉన్న ఫీచర్స్, ప్రత్యేకతలను సీఎస్ సాయి ప్రసాద్, రెవెన్యూ శాఖ అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు బ్లాక్‌చెయిన్ విధానాన్ని రెవెన్యూ శాఖ రూపొందించినట్టు తెలిపారు. భవిష్యత్తులో భూ సమస్యలకు చెక్ పెట్టేలా... ప్రతీ ల్యాండ్ పార్సెల్‌కు ప్రత్యేక డిజిటల్ ఐడీ ఇచ్చి ట్యాంపర్-ప్రూఫ్, సెక్యూరిటీతో లావాదేవీలు జరిగేలా బ్లాక్ చెయిన్ వ్యవస్థను తీర్చిదిద్దినట్టు వెల్లడించారు. ఇక భూ సమస్యలు ఉత్పన్నం కావడానికి డబుల్ రిజిస్ట్రేషన్లు ప్రధాన కారణంగా ఉన్నాయని... ఇకపై డబుల్ రిజిస్ట్రేషన్ సమస్యలను నివారించేలా బ్లాక్ చెయిన్ విధానం పని చేస్తోందని అధికారులు వివరించారు. మిగతా 2లో...

# క్షమాపణ చెప్పకుంటే లీగల్ నోటీసు పంపుతా..

రేవంత్‌కు కేటీఆర్ హెచ్చరిక - గ్లోబరీనాతో తమకు సంబంధం లేదన్న కేటీఆర్

సీఎం ఆరోపణలు పూర్తిగా అసత్యమని వ్యాఖ్య

ఆరోపణలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్

లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక

రేవంత్ కనీసం ఒక్కసారైనా ముఖ్యమంత్రిలా ప్రవర్తించాలంటూ ఘాటు విమర్శలు



**హైదరాబాద్, సింధూరదర్శిని:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై చేసిన ఆరోపణలను వెంటనే ఉపసంహ రించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు తన లీగల్ టీమ్ త్వరలోనే ముఖ్యమంత్రికి నోటీసు పంపనుందని వెల్లడించారు. కొడంగల్‌లో జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ కేటీఆర్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. గ్లోబరీనా సంస్థతో మిగతా 2లో...



# 'నేతన్న సేవ'తో ఆర్థిక దన్ను

రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

చేనేతలకు ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం

51,952 మంది నేతన్నలకు ఆర్థిక లబ్ధి

ఆరోపణలు చేయడమే నిరూపించడం చేతకాదు

జగన్ పై మంత్రి సవిత ఫైర్

**అమరావతి, సింధూరదర్శిని:** రాష్ట్రంలో చేనేత కళాకారులు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఇందులో భాగంగా నేతన్నలకు ఆర్థిక దన్ను కలిగేలా నేతన్న సేవలో పథకానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. నేతన్న సేవలో పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 51,952 మంది నేతన్నలకు ఆర్థిక లబ్ధి కలిగేలా ఏటా రూ. 25వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం మిగతా 2లో...

# జగన్ గందరగోళం సృష్టిస్తున్నారు

అమరావతిపై మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి అభివృద్ధిని జగన్ కళ్లారా చూడాలన్న గొట్టిపాటి

అమరావతి అంతర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతోందని ధీమా

రాజధానిలో భవనాల నిర్మాణాలు అద్భుతంగా సాగుతున్నాయని వెల్లడి



**అమరావతి, సింధూరదర్శిని:** రాజధాని విషయంలో వైసీపీ అధినేత జగన్ అనవసర గందరగోళం సృష్టిస్తూ ప్రజలను తికమక పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండిపడ్డారు. జగన్ కనీసం ఒక్కసారైనా నేరుగా వచ్చి అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని కళ్లారా చూడాలని హితవు పలికారు. రాజధాని నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అమరావతి త్వరలోనే ఒక అంతర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతోందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే ఇక్కడ భారీ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో పాటు ప్రముఖ కళాశాలలు ఏర్పాటు కాబోతున్నాయని వెల్లడించారు. అమరావతిలో భవనాల నిర్మాణాలు అద్భుతంగా సాగుతున్నాయని, భవిష్యత్తులో ఇది అత్యంత అద్భు తమైన నివాస యోగ్యమైన నగరంగా రూపు దిద్దుకుంటుందని తెలిపారు. ఐకానిక్ భవనాలకు సంబంధించిన మొదటి డైమండ్ నిర్మాణం ఇప్ప టికే పూర్తయిందని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి 12ఫ్లోర్లు సిద్ధమవుతాయని ప్రకటించారు. అంతేకాకుండా ప్రాంతీయ అనుసంధానం కోసం త్వరలోనే ఇక్కడ అంతర్జాతీయ విమానాశ్రయం కూడా రాబోతుందని స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణానికి తమ విలువైన మిగతా 2లో...

# క్షమాపణ చెప్పకుంటే లీగల్ నోటీసు పంపుతా..

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్‌కు గానీ, తన కుటుంబానికి గానీ, తనకు గానీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. పేపర్ లీక్‌లాంటి సున్నితమైన అంశంపై ముఖ్య మంత్రి బాధ్యతారాహిత్యంగా తప్పుడు ఆరోపణలు చేయడం దురదృష్టకరమని విమర్శించారు. ముఖ్య మంత్రి హోదాలో ఉండి చౌకబారు రాజకీయాల కోసం అసత్యాలను ప్రచారం చేయడం తగదన్నారు. కనీసం ఒక్కసారైనా ముఖ్యమంత్రిలా వ్యవహరిం చాలని రేవంత్ రెడ్డికి సూచించారు. తనపై తరచూ అసభ్యకరమైన, అర్థంలేని ఆరోపణలు చేసినప్పటికీ ప్రతి సందర్భంలో స్పందించలేదని కేటీఆర్ పేర్కొన్నారు. తాను మౌనంగా ఉండడాన్ని ఆరోపణలను అంగీకరించినట్లు భావించవద్దన్నారు. "బురదలో కుస్తీ పట్టడం నాకు ఇష్టం ఉండదు. అందుకే చాలా సందర్భాల్లో స్పందించను" అని వ్యాఖ్యానించారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టం

(మొదటిపేజీ తరువాయి)

ఇందుకు అవసరమైన అన్ని చర్యలు వెంటనే చేపట్టాలని సంబంధిత శాఖలకు సూచించినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు తీసుకుందని, ఈ నిర్ణయం కూడా అందులో భాగమని మోదీ అన్నారు. యువత భవిష్యత్తుతో ఆటలాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై జంతర్‌మంతర్‌లో విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాని నుంచి ఈ ప్రకటన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## జగన్ గందరగోళం సృష్టిస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

భూములను త్యాగం చేసిన రైతుల చలవ వల్లే ఈరోజు అమరావతిలో ఇంతటి భారీ నిర్మాణాలు సాధ్యమవుతున్నా యని మంత్రి కొనియాడారు. వారి త్యాగాలను కూటమి ప్రభు త్వం ఎప్పటికీ గుర్తుంచు కుంటుందన్నారు. కాగా, ఏపీ ప్రభుత్వం ప్రస్తుతం అమరావతి పునర్నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి శరవేగంగా అడుగులు వేస్తోంది. భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తూ మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేసింది. ఇప్పటికే పలు దిగ్గజ సంస్థలు అమరావతిలో తమ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ఒప్పం దాలు కుదుర్చుకోగా, మరికొన్ని సంస్థలు తమ కార్యాలయాల నిర్మాణ పనులను కూడా ప్రారంభించాయి.

# రెండేళ్లలో రాష్ట్రానికి రూ.29.30లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమల రాక

## స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చిత్తశుద్ధితో అమలు చేయాలి

## పరిశ్రమల గ్రౌండింగ్‌లో ప్రతినెలా పురోగతి కన్పించాలి

## 20లక్షల ఉద్యోగాల కల్పనపై మంత్రుల బృంద సమావేశంలో మంత్రి లోకేష్ దిశానిర్దేశం



మంగళగిరి సింధూరదర్శిని: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు రూ.29,30,357 కోట్ల పెట్టుబడులతో 1037 పరిశ్రమలు ముందుకు వచ్చాయి. వీటిద్వారా 24,66,165 మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉంది. ప్రతి ప్రాజెక్టును ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ త్వరితగతిన గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశం మంత్రి లోకేష్ అధ్యక్షతన ఉండవల్లిలో జరిగింది. సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ... పరిశ్రమలకు భూకేటాయింపులు, అనుమతులు, ప్రోత్సాహకాల విషయంలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రతినెలా నిర్వహించే సమీక్షలో పురోగతి కన్పించాలని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలు ఏపీని ఎంచుకోవడానికి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానమే ప్రధాన కారణం. దీనిని ప్రతి అధికారి చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆదేశించారు. నవంబర్ లో విశాఖపట్నంలో నిర్వహించే పార్టనర్ షిప్ సమ్మిట్ లో మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో కొత్తగా వచ్చే పరిశ్రమలకు పెద్దఎత్తున పునరుత్పాదక ఇంధనం అవసరం, రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాలని కోరారు. నిర్ణీత సమయంలో గ్రౌండ్ చేసిన ఎంఎస్ఎంఇ లకు ప్రోత్సాహకాలు అందించేలా ఆటోమేటిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. గత రెండేళ్లలో 1,20,897 ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు. యువతకు ఎక్కువ ఉద్యోగావకాశాలు కల్పించే ఎంఎస్ఎంఇ యూనిట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగూరి నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఏపీ

(మొదటిపేజీ తరువాయి)



భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా ఉండేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చామని... రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ల శాఖలను ఒకే వేదిక మీదకు తెచ్చేలా ప్రాజెక్ట్ డిజైన్ చేశామని తెలిపారు. చీ×జ ఆంధ్రప్రదేశ్, చీ×జ బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్స్ లైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో మీ భూమి-బ్లాక్ చెయిన్ వ్యవస్థను అభివృద్ధి చేసినట్టు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టును కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ఒక్కో మండలంలో అమలు చేస్తున్నట్టు తెలిపారు. దీంట్లో భాగంగా ఆస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల పరిధిలోని 89 రీ-సర్వే గ్రామాల్లోని 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ చేసేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలట్ ప్రాజెక్ట్ అమలు చేయనున్నట్టు వివరించారు. మీ భూమి-బ్లాక్ చెయిన్ అమలు జరిగే తీరును వివరించే వీడియోను అధికారులు ప్రజెంట్ చేశారు. ఇదే విధానంలో క్యూ ఆర్ కోడ్, ఆధార్ ను అనుసంధానించేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు.

**అధ్యయనం చేయాలి... లోపాలు సరిదిద్దాలి**

మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..." భూ రికార్డులు సరిగా లేకపోవడం వల్ల విలువైన భూముల విషయంలో మోసాలు జరుగుతున్నాయి. తెలంగాణతో పోల్చుకుంటే ఏపీలో ల్యాండ్ లిటిగేషన్లు తక్కువే. కానీ గత ప్రభుత్వ విధానం వల్ల ఏపీలోనూ భూ తగాదాలు... వివాదాలు పెరిగాయి. 22ఏ పేరుతో కక్ష సాధింపులకు పాల్పడ్డారు. ప్రక్షాళన, విముక్తి, భద్రత వంటి అంశాలపై దృష్టి సారించి భూ సమస్యలను పరిష్కరిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా సర్వేలు చేపడుతున్నాం.. రికార్డులను ప్రక్షాళన చేస్తున్నాం... పట్టాదార్ పాస్ పుస్తకాలు రాజముద్ర వేసి ఇస్తున్నాం. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి వంటి గ్రామాల్లో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న భూములకు విముక్తి కల్పించాం. ఇప్పుడు ప్రారంభించిన మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టు ద్వారా భూములకు శాశ్వత భద్రత దక్కుతుంది. భూ రికార్డులకు సంబంధించి ట్యాంపర్ ప్రూఫ్ వ్యవస్థను తెస్తున్నాం.. పటిష్టమైన భద్రత కల్పిస్తున్నాం. బ్లాక్ చెయిన్ ద్వారా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు ఒకే వేదిక మీదకు వస్తాయి... ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రయ విక్రయాలు చేసుకోవచ్చు. రెండు నెలల పాటు ఈ పైలెట్ ప్రాజెక్టు అమలును పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. ఈ వ్యవస్థ అమల్లో ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని నమోదు చేసుకోవడానికి ఓ కంప్లైంట్ సెల్ పెట్టాలి... దానికి అనుగుణంగా బ్లాక్ చెయిన్ ప్రాజెక్టులో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. ఇప్పటి నుంచి సర్వే పూర్తి అయిన గ్రామాలు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థలోకి వెళ్తాయి. నవంబర్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మీ భూమి-బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థ అందుబాటులోకి వచ్చేలా చూడాలి. భూ సమస్యలకు ఫుల్ స్టాప్ పెట్టేలా రెవెన్యూ వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

భూ సమస్యలకు పరిష్కారం చూపితే ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది."అని ముఖ్యమంత్రి చెప్పారు. మంత్రి అనగాని సత్య ప్రసాద్, సీఎస్ సాయి ప్రసాద్, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, ఏడు జిల్లాల కలెక్టర్లు, ఏపీ-ఎన్ఐసీ, బెంగళూరు-ఎన్ఐసీ ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# 'నేతన్న సేవ'తో ఆర్థిక దన్ను

(మొదటిపేజీ తరువాయి)

బడ్జెట్ లో రూ.250 కోట్లు కేటాయించామని, వచ్చే నెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించ నున్నామన్నారు.రాష్ట్రం చేనేత రంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని ఈ నెల 26న రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నామన్నారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించేలా కూటమి ప్రభుత్వం మరో శుభవార్త చెప్పిందన్నారు.నేతన్న సేవలో పథకానికి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఈ మేరకు కేబినెట్ లో ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.

ఆగస్టు ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం నాడు నేతన్న సేవలో పథకానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.ఈ పథకం ద్వారా ఏటా 51,952 మంది నేతన్నలకు రూ.25 వేల ఆర్థిక సాయం అందజేయ నున్నామన్నారు.చేనేతలకు ఆర్థికదన్ను కలిగించేలా నేతన్న సేవలో పథకానికి శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు.

**నేతన్న కుటుంబానికి భారీ ఆర్థిక లబ్ధి.**

50 ఏళ్లు నిండిన 85,678 మంది చేనేతలకు రూ.4 వేల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.51,952 మంది నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నామన్నారు.మగ్గం నేతన్నలకు 200యూనిట్లు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు.మగ్గం నేతన్నలకు నెలకు రూ.720లు, ఏడాదికి రూ.8,640లు, మర మగ్గం నేతన్నలకు నెలకు రూ.1800 చొప్పున ఏడాదికి రూ.21,600లు లబ్ధి కలుగుతోందన్నారు. మగ్గం నేతన్నలకు నేతన్న సేవలో రూ.25 వేలు,పెన్షన్ రూ.48 వేల చొప్పున రూ.48 వేలు, ఉచిత్ విద్యుత్‌తో రూ.8,640లు మొత్తం ఏడాదికి రూ.81,640లు ప్రత్యక్ష ఆర్థిక లబ్ధి కలుగుతుందన్నారు.మర మగ్గం నేతన్నలకు నేతన్న సేవలో పథకం కింద రూ.25 వేలు,పెన్షన్ రూపంలో రూ.48 వేలు, ఉచిత విద్యుత్ కింద రూ.21,600లు కలిపి మొత్తం రూ.94,000 లబ్ధి కలుగుతోందన్నారు.

**చంద్రబాబు పాలన నేతన్నలకు స్వర్ణయుగమే..**

కూటమి ప్రభుత్వం రాగానే నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకొచ్చామని మంత్రి సవిత గుర్తు చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా టెక్స్ టైల్స్ పార్కులు,క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేతన్నలకు గౌరవప్రద జీవనమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు.ఏటా త్రిఫ్ట్ ఫండ్ కింద రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నామని,నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తున్నామని తెలిపారు. చేనేతలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యమని,ఆప్కో చరిత్రలో మొట్టమొదటిసారిగా టీటీడీతో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు.చంద్రబాబు పాలన నేతన్నలకు ఎప్పుడూ స్వర్ణయుగమేనని మంత్రి సవిత కొనియాడారు.

**26న రాష్ట్ర పండుగగా ప్రగడ కోటయ్య జయంతి.**

ఈ నెల 26న చేనేత సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించ నున్నామని మంత్రి సవిత తెలిపారు.చీరాలలో ప్రగడ కోటయ్య రాష్ట్ర స్థాయి జయంతిని జరపనున్నట్లు వెల్లడించారు.

**మాజీ సియం జగన్ కు నిరూపణ చేతకాదు.**

జగన్ కు ఆరోపణలు చేయడమే తప్ప నిరూపించడం చేతకాదని, కూటమి ప్రభుత్వాన్ని అబాసుపాలు చేయ డమే ఆయన లక్ష్యమని మంత్రి సవిత విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ హామీని జగన్ నెరవేర్చలేద న్నారు. ఏటా జాబ్ క్యాలెండర్,సీపీఎస్ రద్దు, డీఎస్సీ నిర్వహణ,సంపూర్ణ మద్యపాన నిషేధం,ఇద్దరు బిడ్డలకు అమ్మఒడి అని హామీలిచ్చి ఏ హామీని కూడా ఆయన నెరవేర్చలేదన్నారు. కూటమి ప్రభుత్వంపై జగన్ కు మాట్లాడే నైతిక హక్కే లేదన్నారు.అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు తన మొదటి సంతకం మెగా డీఎస్సీ నిర్వహణ ఫైల్ సంతకం చేసి, తనమాట నిలబెట్టుకు న్నారన్నారు.గతంలోనూ సీఎం చంద్రబాబు ఎంతో పారదర్శకతతో డీఎస్సీలు నిర్వహించారని గుర్తుచేశారు. గతేడాది మెగా డీఎస్సీని కూడా అవకతవకలకు తావు లేకుండా పూర్తి చేశారని మంత్రి సవిత కొనియాడారు.

# ఢిల్లీ పోలీసులకు ఎన్ఎస్ఏ అధికారాలు..

న్యూఢిల్లీ: నీట్ పరీక్షల అవకతవకలపై దేశ రాజధాని ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళనలు ఉద్రిక్తంగా మారుతున్న సమయంలో ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద ప్రత్యేక అధికారాలు కల్పిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులు చర్చనీయాంశమయ్యాయి. అయితే, ఇది ప్రతి మూడు నెలలకోసారి జరిగే సాధారణ పునరుద్ధరణ ప్రక్రియేనని, దీనికి కొనసాగుతున్న నిరసనలకు ఎలాంటి సంబంధం లేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు.



లెఫ్టినెంట్ గవర్నర్ ఈ నెలలో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. 2026 జులై 19 నుంచి అక్టోబర్ 18 వరకు మూడు నెలల పాటు జాతీయ భద్రతా చట్టం-1980 కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసే అధికారాన్ని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు అప్పగించారు. ఈ నిర్ణయంపై పలు మీడియా సంస్థలు భిన్న కథనాలు ప్రచురించాయి. సీజేపీ నిరసనలను అణచివేసేందుకే ఈ అధికారాలు ఇచ్చారని వార్తలు రావడంతో ఢిల్లీ పోలీసులు నేడు ఒక ప్రకటన విడుదల చేశారు.

"కొన్ని మీడియా సంస్థలు నివేదిస్తున్నట్లుగా, సీజేపీ నిరసనలను అణిచివేసేందుకు పోలీస్ కమిషనర్‌కు ఎన్ఎస్ఏ అధికారాలు ఇచ్చారనడంలో వాస్తవం లేదు. ఇది కేవలం రొటీన్ పరిపాలనా ప్రక్రియ. జులై 19 నుంచి అక్టోబర్ 18 వరకు అధికారాల పునరుద్ధరణ కోసం జులై 7వ తేదీనే ఉత్తర్వులు జారీ అయ్యాయి. సీజేపీ నిరసనలు తీవ్రరూపం దాల్చడానికి ముందే ఈ ప్రక్రియ పూర్తయింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యేకంగా ఎలాంటి అభ్యర్థన చేయలేదు. మీడియా ఈ ఉత్తర్వులను తప్పుగా అన్వయించుకుంది" అని ఢిల్లీ పోలీసులు తమ ప్రకటనలో వివరించారు.

**ఉద్రిక్తంగా మారిన సీజేపీ నిరసనలు**

పరీక్షల్లో అవకతవకలకు నిరసనగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ యువత పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నారు. బోస్టన్ యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ అభిజీత్ దిప్కే సోషల్ మీడియాలో వ్యంగ్యంగా ప్రారంభించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' ప్రచారం, ఇప్పుడు దేశవ్యాప్తంగా యువత నేతృత్వంలోని ఉద్యమంగా మారింది.

జూన్ 20న జంతర్ మంతర్ వద్ద ప్రారంభమైన ఈ నిరసన, జూన్ 28న పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్షతో మరింత ఉద్ధృతమైంది. గత వారాంతంలో ఆరోగ్యం క్షీణించగా ఆయన్ను బలవంతంగా సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించడంతో ఆందోళనలు తీవ్రమయ్యాయి.

నిన్న రాత్రి జంతర్ మంతర్ సమీపంలోని సంసద్ మార్గ్ వద్ద పరిస్థితులు హింసాత్మకంగా మారాయి. నిరసనకారులు, భద్రతా సిబ్బంది మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు రువ్వగా, వారిని చెదరగొట్టేందుకు ఢిల్లీ పోలీసులు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) బలగాలు టియర్ గ్యాస్ ప్రయోగించాయి. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో అధికారులు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు.



## శాశ్వత పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలి:కమిషనర్ వై ఓ.నందన్

నెల్లూరు (సింధూరదర్శిని) 23 జూలై నెల్లూరు జిల్లా ; నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు స్థానిక 23వ డివిజన్ పడారుపల్లి ప్రాంతంలోని మారుతి లేఅవుట్ ప్రాంతాన్ని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు.లేఅవుట్ పరిధిలోని సమస్యకు శాశ్వత పరిష్కారం అందించేలా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. అదేవిధంగా స్థానిక 3వ డివిజన్ ప్రశాంతినగర్ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న ఫిర్యాదుకు పరిష్కారం అందించేందుకు కమిషనర్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్ రఘునాథరావు, టి.పి.బి.ఓలు, వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యతతో పనులన్నీ పూర్తి అయ్యేలా పర్యవేక్షించాలి

**- కమిషనర్ వై ఓ. నందన్ -**



నెల్లూరు( సింధూర దర్శిని) 23 జూలై నెల్లూరు జిల్లా ; నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ నగర పర్యటనలో భాగంగా స్థానిక రంగ నాయకులపేట పినాకిని పార్క్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. పార్కులో నిర్దేశించిన అభివృద్ధి పనులన్నీ సమయాను కూలంగా పూర్తి అయ్యేలా నాణ్యతతో పనులన్నీ జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం స్థానిక మున్సిపల్ పాఠశాలకు వెళ్తున్న ఇద్దరు విద్యార్థులతో కమిషనర్ ముచ్చటించారు. విద్యార్థుల పాఠశాల, తరగతి ఇతర దినచర్యలను అడిగి తెలుసుకున్నారు. నెల్లూరు నగరపాలక ఆధ్వర్యంలో నడుస్తున్న మున్సిపల్ పాఠశాల ద్వారా అందుతున్న విద్యావసతులను పూర్తిస్థాయిలో అందుకొని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని కమిషనర్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రహంతు జానీ, ఈ.ఈ చంద్రయ్య, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దేశం అభివృద్ధి చెందాలంటే టాక్స్ చెల్లించాలి

**ఇన్కమ్ టాక్స్ అధికారి ఆర్ మోహన్ కృష్ణ**




గూడూరు (సింధూర దర్శిని) 23 జూలై నెల్లూరు జిల్లా ; గూడూరు పట్టణంలోని డి.ఆర్.డబ్ల్యు కళాశాలలో గురువారం ఇన్కమ్ టాక్స్ దినోత్సవ కార్యక్రమాన్ని ఆ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.టాక్స్ చెల్లించడం వలన దేశాభివృద్ధికి ఎంతగా తోడ్పడుతుందో డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థినీలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఇన్కమ్ టాక్స్ అధికారి ఆర్.మోహనకృష్ణ మాట్లాడుతూ... దేశం అభివృద్ధి చెందాలంటే తప్పనిసరిగా టాక్స్ చెల్లించాలని, టాక్స్ చెల్లించడం ద్వారానే ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ జరుగుతుందని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా టాక్స్ ను చెల్లించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్ రావు, కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు, ఇన్కమ్ టాక్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు రేణింగవరంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటన

ప్రకాశం, (సింధూరదర్శిని): రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పలు అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం పంగులూరు మండలంలోని రేణింగవరం లో శుక్రవారం పర్యటిస్తున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ కార్యదర్శి కుక్కపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10:00గంటలకు రేణింగవరం గ్రామంలో 3కోట్ల రూపా యలు వ్యయంతో నూతనంగా నిర్మించిన రేణింగవరం నుండి అలవలపాడు బిటిరోడ్డు ప్రారంభోత్సవ కార్యక్ర మంలో మంత్రి రవికుమార్ పాల్గొంటారని, ఉదయం 10:30 గంటలకు గ్రామంలో పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.






# పల్లె వీక్షణతో గ్రామాల్లో సమస్యలకు వేగంగా పరిష్కారం

**క్షేత్రస్థాయిలో ప్రజల ఇబ్బందులను తెలుసుకుని పరిష్కారం చూపిస్తున్నాం: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**

**వెంకటాచలం మండల కేంద్రంలో కలెక్టర్ హిమాన్షుశుక్ల, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పర్యటన**

నెల్లూరు (సింధూరదర్శిని) 23 జూలై నెల్లూరు జిల్లా ; వెంకటాచలం "గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించడమే 'పల్లె వీక్షణ' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు." గురువారం వెంకటాచలం మండల కేంద్రంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి కలెక్టర్ పల్లె వీక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వెంకటాచలం సమీపంలోని వడ్డిపాలెం లో చేపడుతున్న వీబీజీ-రాంజీ ఉపాధి హామీ పనులను పరిశీలించి పనులు నాణ్యత ప్రమాణా లకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించి వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలు, మౌలిక వసతులను తనిఖీ చేసి వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలని సూచించారు. వీరన్న కనుపూరు చెరువును ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇటీవల సంభవించిన తుఫానుల కారణంగా దెబ్బతిన్న వీరన్న కనుపూరు చెరువుకు రూ.47లక్షలతో చేపట్టిన పునరుద్ధరణ పనులను పరిశీలించి, నాణ్యతతో పూర్తి చేసిన ఇరిగేషన్ అధికారులను అభినందించారు. పశుసంవర్ధక శాఖ నిర్వహించిన కృత్రిమ గర్భధారణ ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు.

### గ్రామసభలో ప్రజలతో ముఖాముఖి

అనంతరం నిర్వహించిన గ్రామసభలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్, ఎమ్మెల్యే ప్రతి సమస్యను శ్రద్ధగా విని సంబంధిత శాఖల అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, సాగునీరు, రహదారులు, వైద్యం, తాగునీరు, గృహ నిర్మాణం, విద్య తదితర అంశాలపై వచ్చిన వినతులను గడువులోగా పరిష్కరించాలని సూచించారు.

### ప్రతి అర్జీకి నిర్దిష్ట గడువులో పరిష్కారం

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ, పల్లె వీక్షణలో అందిన ప్రతి అర్జీని ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేసి 30రోజుల్లో పరిష్క రించేలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్య లు కార్యాలయాలకు వచ్చే వరకు వేచి ఉండకుండా అధికారులే గ్రామాలకు వెళ్లి సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేస్తున్నామని, పిడియాట్రిషియన్, జనరల్ వైద్యుల కొరతను తీర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలు ఆదర్శవంతంగా పనిచేస్తున్నాయని ప్రశంసించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించి వర్మీ కంపోస్ట్ ఉత్పత్తిని పెంచాలని సూచించారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని, ఈ నెల 24న జిల్లావ్యాప్తంగా జరగనున్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పేరెంట్ టీచర్ సమావేశాల్లో తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వెంకటాచలం మండలంలో సంక్షేమ పథకాలతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు కూడా చాలా బాగా జరుగుతున్నాయని కలెక్టర్ అధికారులను అభినందించారు.

### అభివృద్ధి పనులకు ప్రభుత్వం పెద్దపీట

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు వేగవంతం చేయాలని అధికారులను కోరారు.ఇరిగేషన్ రంగానికి అధిక నిధులు మంజూరై చెక్‌డ్యామ్‌లు, తూర్పు కనుపూరు చెరువు అభివృద్ధి పనులు చేపట్టడంతో రైతులకు సాగునీరు మెరుగ్గా అందుతోందన్నారు. ఉపాధి హామీ, తాగునీటి పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అభివృద్ధి జరుగుతోందని పేర్కొన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల అభివృద్ధి, డయాలసిస్ సెంటర్, సీఆర్సీ సెంటర్, సోలార్ లైటింగ్, ఆర్ఓ వాటర్ ప్లాంట్ల ఏర్పాటు వంటి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా అర్హుల ఖాతాల్లో నిధులు జమయ్యాయని, వెంకటాచలం మండలంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 1,439 ఇళ్లు మంజూరయ్యాయని వెల్లడించారు.గతంలో భూ రీ-సర్వేలో ఏర్పడిన సమస్యలను పూర్తిగా పరిష్కరించి నిజమైన రైతులు, పేదలకు న్యాయం జరిగేలా అధికారులు పనిచేయాలని కోరారు. ప్రతి గురువారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్, పల్లె వీక్షణ కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 2.98లక్షల పీఎన్‌జీ కనెక్షన్లు

**2032 నాటికి 83.61లక్షల కనెక్షన్ల లక్ష్యం - పీఎన్‌జీ గృహ కనెక్షన్లపై పార్లమెంటులో ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర మంత్రి సమాధానం**



నెల్లూరు (సింధూర దర్శిని) 23 జూలై నెల్లూరు జిల్లా ; ఆంధ్రప్రదేశ్‌లో గృహాలకు పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్ల లక్ష్యాలు, ఇప్పటి వరకు సాధించిన పురోగతి, జిల్లాల వారీగా కనెక్షన్ల వివరాలు, అలాగే 2024-25, 2025-26 సంవత్సరాల్లో ఇచ్చిన కనెక్షన్ల గురించి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పార్లమెంటులో లిఖితపూర్వకంగా కొన్ని ప్రశ్నలు అడిగారు. ఎంపీ అడిగిన ప్రశ్నలకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ సహాయ మంత్రి సురేష్ గోపీ గురువారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గృహాలకు పీఎన్‌జీ కనెక్షన్ల కల్పన అనేది సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన నెట్‌వర్క్ అభివృద్ధిలో భాగంగా జరుగుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు నిర్దేశించిన ఆధారంగా సంబంధిత సంస్థలు ఈ పనులు చేపడుతున్నాయని వివరించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం 10 భౌగోళిక ప్రాంతాలకు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ అభివృద్ధికి అనుమతులు ఇచ్చినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఈ ప్రాంతాల్లో 2032 మార్చి నాటికి మొత్తం 83,61,290 గృహాలకు పీఎన్‌జీ కనెక్షన్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. 2026 మే 31 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 2,98,111 గృహాలకు పీఎన్‌జీ కనెక్షన్లు అందించినట్లు పేర్కొన్నారు. అలాగే 2024 మార్చి 31 నాటికి రాష్ట్రంలో జిల్లాల వారీగా 2,75,517 కనెక్షన్లు అందించినట్లు పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో అత్యధికంగా 1,15,476 కనెక్షన్లు అందించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. కృష్ణా జిల్లాలో 85,372, పశ్చిమ గోదావరిలో 51,107, వైఎస్సార్ కడప జిల్లాలో 6,010, విశాఖపట్నం జిల్లాలో 5,463, అనంతపురం జిల్లాలో 5,071, చిత్తూరు జిల్లాలో 3,932, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 3,086 కనెక్షన్లు అందించినట్లు వెల్లడించారు. శ్రీకాకుళం, విజయనగరం, గుంటూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో ఆ తేదీ నాటికి కనెక్షన్లు నమోదు కాలేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,75,517 గృహాలకు పీఎన్‌జీ కనెక్షన్లు ఇచ్చినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. 2024-25, 2025-26 సంవత్సరాల్లో ఎలాంటి కనెక్షన్లు ఇవ్వలేదా అని ఎంపీ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ... 2024-25లో 6,894 కొత్త గృహాలకు పీఎన్‌జీ కనెక్షన్లు ఇవ్వడంతో మొత్తం కనెక్షన్ల సంఖ్య 2,82,411కు చేరిందని తెలిపారు. అలాగే 2025-26లో మరో 14,029 కనెక్షన్లు కల్పించడం ద్వారా మొత్తం కనెక్షన్ల సంఖ్య 2,96,440కు పెరిగినట్లు వెల్లడించారు.

# విద్యార్థులకు అవగాహన సదస్సు

**రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మల్లెమాల ప్రమీల**




శ్రీకాళహస్తి (సింధూరదర్శిని) 23 జూలై తిరుపతి జిల్లా; శ్రీకాళహస్తిలోని రోటరీ క్లబ్ & ఎంజీఎం హాస్పిటల్ ఆధ్వ ర్యంలో గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మల్లెమాల ప్రమీల మాట్లాడుతూ గవర్న మెంట్ హాస్పి టల్ దగ్గర ఉన్న, గవర్నమెంట్ ఉమెన్స్ ఇంటర్మీడియట్ కాలేజీ నందు రోటరీ క్లబ్ & ఎంజీఎం హాస్పిటల్ ఆధ్వర్యంలో అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. డాక్టర్ ముని లక్ష్మీ, డాక్టర్ దీపిక భరత్ భార్య) గైనకాల జిస్ట్ వీరి ఆధ్వర్యంలో హెల్త్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వ హించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మల్లెమాల ప్రమీల, సెక్రెటరీ మ్యాగీ క్లారా, డాక్టర్ భరత్, తరుణ్, కండ్రిగ ఉమా, డాక్టర్లు విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

# అర్హత కలిగిన ప్రతి రైతుకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలి

ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు తప్పనిసరిగా పంటల బీమా నమోదు చేసుకోవాలి

సీఎస్‌సీ కేంద్రాలు, బ్యాంకులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్




తిరుపతి (సింధూర దర్శిని) 23 జూలై తిరుపతి జిల్లా ; ఎల్‌నినో ప్రభావం కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, జిల్లాలో అర్హత కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా నమోదు చేసుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ ఛాంబర్ నుండి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ పంటల బీమా నమోదుల పురోగతి, రైతులకు అవగాహన కల్పించే చర్యలు, గ్రామాల వారీగా నమోదుల స్థితి, ఎదురవుతున్న సమస్యలు, నమోదు ప్రక్రియను వేగవంతం చేసే చర్యలపై సమగ్రంగా సమీక్షించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, అధిక వర్షాలు, వర్షాభావం, తుఫాన్లు, ఎల్‌నినో ప్రభావం వంటి పరిస్థితుల వల్ల రైతులు నష్టపోయే అవకాశం ఉన్నందున పంటల బీమా వారికి ఆర్థిక భరోసా కల్పించే అత్యంత ముఖ్యమైన రక్షణ కవచమని అన్నారు. అందువల్ల ఒక్క అర్హ రైతు కూడా ఈ అవకాశాన్ని కోల్పోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రుణాలు పొందిన ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా నమోదు చేసుకునేలా మండల వ్యవసాయ అధికారులు, బ్యాంకు మేనేజర్లు సంయుక్తంగా రైతులతో సమావేశాలు నిర్వహించి పథకం ప్రయోజనాలను వివరించాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి సందేహాలు లేకుండా పూర్తి అవగాహన కల్పించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలోని అన్ని సీఎస్‌సీ నిర్వాహకులు రైతులకు పంటల బీమా నమోదు ప్రక్రియలో పూర్తి సహకారం అందించాలని, ఎలాంటి ఆలస్యం లేకుండా నమోదు సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. అదేవిధంగా అన్ని బ్యాంకుల రీజనల్ మేనేజర్లు తమ పరిధిలోని శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, పంట రుణాలు పొందిన ప్రతి రైతుకు వెంటనే పంటల బీమా నమోదు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ స్థాయిలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రైతులకు పంటల బీమా ప్రాధాన్యతను వివరించాలని, అర్హత కలిగిన ప్రతి రైతు బీమా పరిధిలోకి వచ్చేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసి రైతులకు పథకం వివరాలను పూర్తిస్థాయిలో తెలియజేయాలని ఆదేశించారు. నమోదు ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక, పరిపాలనా సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ-క్రాప్ నమోదు, భూ వివరాలు, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు తదితర అంశాలు సక్రమంగా నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని, నమోదు అనంతరం రైతులకు రసీదులు, ధృవీకరణ వివరాలు తప్పనిసరిగా అందేలా చూడాలని సూచించారు. గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండి బీమా నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని, విస్తృత ప్రచారం ద్వారా రైతుల్లో అవగాహన పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. మండలాల వారీగా నమోదు పురోగతిని ప్రతిరోజూ సమీక్షించి లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, వెనుకబడిన మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి రైతు పంటల బీమా పరిధిలోకి వచ్చేలా కార్యాచరణ రూపొందించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. రైతులకు అందించే ప్రతి ప్రభుత్వ సేవలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనం ఉండాలని, రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ, ఉద్యానవన, సహకార, రెవెన్యూ శాఖల జిల్లా అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, సంబంధిత బ్యాంకుల ప్రతినిధులు, సీఎస్‌సీ నిర్వాహకులు, రైతు సేవా కేంద్రాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## 22 ఏ, రీ-సర్వే పై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరం చూపాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు

తిరుపతి( సింధూర దర్శిని) 23 జూలై తిరుపతి జిల్లా; 22 ఏ, రిసర్వే పై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన సమస్య పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ నందు 22 ఏ , రీ సర్వే, పి పి బి డిస్ట్రిబ్యూషన్, రెవెన్యూ రికార్డుల కంప్యూటరీకరణ, సివిల్ సప్లైస్, ఐ వి ఆర్ ఎస్ ఫీడ్ బ్యాక్ ల పై డి ఆర్ ఓ జి. నరసింహులుతో కలసి జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహశీల్దార్ లు, మండల సర్వేయర్‌లు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలవ్వాలంటే రెవెన్యూ అధికారుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజా సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. మ్యుటేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని భూముల మ్యుటేషన్, పట్టాదారు పాస్‌బుక్ సవరణ, రికార్డుల నవీకరణ అంశాల్లో నిర్లక్ష్యం వహించకుండా నిర్ణీత గడువు లోపల పరిష్కారం చూపాలన్నారు. రీ--సర్వే కారణంగా ఏర్పడుతున్న భూసరిహద్దుల సమస్యలు, రికార్డుల వ్యత్యాసాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలన్నారు. రీ--సర్వే సందర్భంగా రైతులతో ముందస్తుగా పరిశీలన చేసి సమస్య రాకుండా చూడాలన్నారు. సివిల్ సప్లైస్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఐ వి ఆర్ ఎస్ ద్వారా వచ్చిన కాల్స్‌కు తక్షణ స్పందన ఐ వి ఆర్ ఎస్ ద్వారా ప్రజలు చేసిన కాల్స్‌కు సత్వర స్పందనతో పాటు సమస్య పరిష్కారం కనిపించాలన్నారు. కేవలం కాల్ నమోదు చేయడమే కాకుండా, సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లకు సూచించారు.

# అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు పంపిణీ



ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేతుల మీదుగా ఇండక్షన్ స్టవ్, వంట పాత్రలు పంపిణీ

శ్రీకాళహస్తి (సింధూరదర్శిని) 23 జూలై తిరుపతిజిల్లా; శ్రీకాళహస్తిలోని అంగన్వాడి సెంటర్లకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అధ్యాక్షతన వారి చేతుల మీదుగా శ్రీకాళహస్తి మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు ఆధునిక పరికరాలు అయిన ఇండక్షన్ స్టవ్, కుక్కర్స్, వంట పాత్రలు, మాట్స్ అందచేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళాభి వృద్ధి, శిశు సంక్షేమ శాఖ లోని అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా అంగన్వాడీ కేంద్రాలను సమూలంగా మోడల్ సెంటర్స్ గా అభివృద్ధి చేస్తున్నామని, అలానే ఆధునిక పరికరాలు అయినా ఇండక్షన్ స్టవ్స్, వంట సామాగ్రి, కుక్కర్లు అంద చేసారు. అదే విధంగా పిల్లలకు ప్రాథమిక విద్య, మూడు సంవత్సరాలు లోపల పిల్లలకు నవ చేతన కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల నాయకులు చెంచయ్య నాయుడు, కామేష్ యాదవ్ ,కృష్ణ యాదవ్, బత్తి రెడ్డి, జగదీశ్ రెడ్డి, ఎంపీడీఓ, సీడీపీఓ శాంతి దుర్గ, సూపెర్వైసోర్స్ భాగ్యలక్ష్మి, ప్రియాంక అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెండింగ్ జీతాలను వెంటనే ఇవ్వాలి

### ఏ. ఐ.టి. యు.సి నియోజకవర్గ అధ్యక్షులు సి.వి.ఆర్ కుమార్



గూడూరు( సింధూర దర్శిని) 23 జూలై నెల్లూరు జిల్లా ; స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల జీతాలను వెంటనే ఇవ్వాలని ఏ. ఐ.టి. యు.సి నియోజకవర్గ అధ్యక్షులు సి విఆర్ కుమార్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 7 నెలలుగా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే శానిటేషన్ సిబ్బందికి జీతాలు చెల్లించడం లేదన్నారు. కొత్త కాంట్రాక్టర్ క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ఏం. ఓ.యు ప్రకారం పూర్తిజీతాలు చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రత కలించాలన్నారు. నూతన ఆసుపత్రిని త్వరలోనే వినియోగంలోకి తీసుకురావాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెల క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాలు లేకపోవడం వలన కుటుంబ జీవనం అగమ్య గోచరంగా ఉంద న్నారు. అనంతరం ఆర్డీవోకి వినతిపత్రం అందచేశారు. ఆర్డీవో సాను కూలంగా స్పందించి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజవర్గ కార్యదర్శి జి.శశికుమార్, సీపీఐ పట్టణ కన్వీనర్ వై.సునీల్ , ఏ.ఐ.ఎస్.ఎఫ్ నాయకులు యశ్వంత్, మెడికల్ శానిటేషన్ వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి:ఐసిడిఎస్ సిడిపిఓ షేక్. మెహబూబి




గూడూరు (సింధూర దర్శిని) 23 జూలై నెల్లూరు జిల్లా ; బేటి బచావో బేటి పడావో వార్షిక ప్రణాళికలో భాగంగా ఈ నెలలో సైబర్ సేఫ్టీ అంశం మీద చిల్లకూరు మండల పరిధిలోని చిల్లకూర్ జడ్పీ హైస్కూల్ నందు కిశోర బాల బాలికలకు గురువారం అవగాహన కల్పించడం అయినది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ షేక్. మెహబూబి పాల్గొని, మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల పిల్లలు, పెద్దలు అప్రమత్తంగా ఉండాలని బాల్య వివాహాలు జరగకుండా 18 సంవత్సరాలలోపు పిల్లలకు వివాహం జరగకుండా చూడాలని, బాల కార్మికులు ఉండరాదని తెలిపారు. అంతేకాకుండా అక్రమ రవాణా గురించి వివరించారు. శ్రీవిద్య ఆడపిల్లలను బడికి మానేయ కుండా తప్పకుండా చదివించాలని తెలియజేశారు. అంతేకాకుండా సోషల్ మీడియా ద్వారా వచ్చిన ఫేస్ బుక్ , ట్విట్టర్ , ఇంస్టాగ్రామ్ ద్వారా వచ్చిన లింకులను ఓపెన్ చేయవద్దని. పరిచయం లేని వ్యక్తులతో చాటింగ్ చేయవద్దని, బ్యాంకుల ద్వారా ఎలాంటి ఓటిపిలు రావు అని ఇలాంటివి నమ్మ వద్దని, వీటన్నిటి నుండి మిమ్మల్ని మీరే రక్షించుకోవాలని అవగాహన కల్పించారు. అంతేగాకుండా మంచి పౌష్టిక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ఎం నారాయణ , అంగన్వాడి సూపర్వైజర్ రేణుకమ్మ, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, అంగన్వాడి కార్యకర్తలు అలేఖ్య, పెంచలమ్మ, కమలమ్మ , ఇందిరావతి , ప్రసన్న, సుజాతమ్మ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శాకాంబరి అలంకార మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి



బుచ్చిరెడ్డిపాలెం (సింధూరదర్శిని)23 జూలై నెల్లూరుజిల్లా; బుచ్చిరెడ్డి పాలెం మండలం జొన్నవాడ క్షేత్రం నందు ఆషాఢ మాసాన్ని పురస్కరిం చుకొని శుక్రవారం నిర్వహించనున్న శ్రీకామాక్షితాయి అమ్మవారి శాకాం బరి అలంకార మహోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శాకాంబరి స్వరూపిణిగా అమ్మవారిని అలంకరించేందుకు భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించిన వందలాది రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు మరియు పుష్పాలను దేవస్థాన అధికారులు ప్రత్యేకంగా వర్గీకరించి అలంకరణకు సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతోంది. శాకాంబరి దేవి అన్నపూర్ణ స్వరూపిణి. భూమిపై సమస్త జీవరాశులకు ఆహారాన్ని ప్రసా దించే దైవస్వరూపంగా అమ్మవారిని భావిస్తూ ఈ విశిష్ట అలంకారాన్ని ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగు తోంది. ఈఅలంకారాన్ని దర్శించడం ద్వారా కుటుంబంలో సుఖశాంతులు, సకాల వర్షాలు, పంటల సమృద్ధి, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు చేకూరుతాయని భక్తుల విశ్వాసం.ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శన, త్రాగునీరు, ప్రసాద పంపిణీ, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లు చేశారు. భక్తులందరూ కుటుంబ సమేతంగా విచ్చేసి శ్రీ కామాక్షితాయి అమ్మవారి దివ్య శాకాంబరి అలంకారాన్ని దర్శించి, ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందవలసిందిగా కోరుచున్నాము.

## భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మహిళలు ఆషాఢ సారె



బుచ్చిరెడ్డిపాలెం (సింధూర దర్శిని) 23 జూలై నెల్లూరు జిల్లా; బుచ్చిరెడ్డిపాలెం మండలం జొన్న వాడ క్షేత్రం నందు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని శ్రీ కామాక్షితాయి అమ్మవారికి సుమారు 100మంది ముత్తైదువులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆషాఢ సారెను సమర్పించారు.సాంప్రదాయ వస్త్రధారణలో, మంగళ వాయిద్యాల నడుమ మహిళలు పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, చీర, రవికె, తాంబూలం తదితర మంగళద్రవ్యాలతో సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల అమ్మవారి నామస్మ రణలు, మంగళహారతులు, శివనామ సంకీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఆషాఢ మాసంలో అమ్మవారికి సారె సమర్పించడం ద్వారా కుటుంబ సౌఖ్యం, అష్టైశ్వర్యాలు, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా దేవస్థాన అర్చకులు మహిళలకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# క్రైం న్యూస్



## సచివాలయంలో ఏఎన్ఎం ఉరివేసుకుని ఆత్మహత్య

### ఉలిక్కిపడ్డ తొణుకు మాల గ్రామస్తులు


### సూసైడ్ నోట్ రాసిన ఏఎన్ఎం



మృతురాలి ఫైల్‌ఫోటో

గూడూరు( సింధూర దర్శిని) 23 జూలై నెల్లూరు జిల్లా ; చిల్లకూరు మండలంలోని తొణుకుమాల గ్రామంలో సచివాలయంలో పనిచేసే ఏఎన్ఎం ఫ్యానుకు ఉరి వేసుకొని మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సురేష్ బాబు వివరాలు మేరకు ఓజిలి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన శ్రీపతి రమణయ్య రెండవ కుమార్తె సాయి చందన ప్రియ (27) సచివాలయంలో ఏఎన్ఎం గా పనిచేస్తుంది. గత ఏడాది క్రితం తొణకుమాల గ్రామంలోని సచివాలయం కు బదిలీ పై వచ్చింది అప్పటినుంచి సచివాలయం పరిధిలోని గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తుంది. అలాగే చింతవరం పీహెచ్ వైద్యులు చేపట్టే ఆరోగ్య కార్యక్రమాల్లో కూడా భాగస్వామ్యంతో పనులు చక్కబెట్టుకునేది. ఈ క్రమంలో ఆమె సచివాలయంలో ఎవరు లేని సమయంలో గురువారం ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందింది. అంతకు ముందు సూసైడ్ నోట్లో తల్లిదండ్రులను క్షమాపణ అడగడం తో పాటు తన చావుకు ఎవరు కారణం కాదంటూ రాసి ఉంది. సచివాలయంలో పనిచేసే సిబ్బంది బయట క్యాంపులకు వెళ్ళగా ఆశ వర్కర్లు ఆమెతోనే ఉన్నారు. అయితే ఆమె వారిని పాఠశాల వద్దకు వెళ్లాలని చెప్పడంతో విధి నిర్వహణలో భాగంగా ఆశ వర్కర్లు అక్కడికి వెళ్లారు. అప్పుడు సచివాలయంలో ఎవ్వరు లేకపోవడంతో ఆమె సీలింగ్ ఫ్యాన్ వద్దకు టేబుల్ ను లాక్కెళ్ళి ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకుని కొట్టుమిట్టాడుతుంది. ఆ సమయంలో సచివాలయంలో పని కోసం వచ్చిన ఒకరు గుర్తించి చుట్టుపక్కల వారిని కేకలు వేయడంతో వారు వచ్చి ఉరివేసుకున్న సాయి చందన ప్రియ ను కిందకి దించేసరికే కొనఊపిరితో ఉంది దీంతో ఆమెకు సపర్యలు చేసినప్పటికీ అప్పటికే మృతి చెందింది. దీంతో స్థానికులు పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వడంతో ఆయన ఎంపీడీవోను వెంటబెట్టుకుని సచివాలయం వద్దకు వచ్చారు. అదే సమయంలో ఆశా వర్కర్లు చింతవరం పీహెచ్సీ వైద్యులకు సమాచారం ఇవ్వడంతో వారు కూడా సంఘటన స్థలానికి చేరుకున్నారు. సచివాలయం వద్దకు చేరుకున్న పంచాయతీ కార్యదర్శి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై సురేష్ బాబు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో రాజుపాలెం నుంచి కుటుంబ సభ్యులు సచివాలయం వద్దకు చేరుకుని మృతి చెందిన సాయి చందన ప్రియ మృతదేహం వద్ద బోరున విలపించడంతో చూపర్లను కల్చివేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా హాస్పిటల్ కి పోస్టుమార్టం నిమిత్తం తరలించి , కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అంగరంగ వైభవంగా శ్రీ మాతా పరమేశ్వరి గ్రామోత్సవం





గూడూరు (సింధూర దర్శిని) 23 జూలై నెల్లూరు జిల్లా; చిల్లకూరు మండల పరిధిలోని కడివేడు గ్రామంలో ఐదు రోజులుగా జరుగుతున్న శ్రీ మాతా పరమేశ్వరి అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా గురువారం టిడిపి సీనియర్ నాయకులు పెనుబోలు జానకిరామ్ రెడ్డి ఆధ్వర్యంలో మాత పరమేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం తప్పెట్లు, తాళాలు, డీజే బ్యాండ్ వాయిద్యాలతో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం జరిగింది.

ఈ గ్రామోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్క గ్రామాల ప్రజలు , బంధుమిత్రులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాలకమండలి సమీక్షా సమావేశం

### ఆలయ ఈవో పెంచల కిషోర్, ఆలయ చైర్మన్ మణి



కాణిపాకం( సింధూర దర్శిని) 23 జూలై చిత్తూరు జిల్లా; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం కార్యనిర్వహణధికారి కార్యాలయం మీటింగ్ హాలు నందు గురువారం పాలకమండలి సమావేశం నిర్వహించడం జరిగింది. ఆలయ చైర్మన్ మణి నాయుడు, దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించడం జరిగింది, మొదటి అంశం 2026 సంవత్సరం వార్షిక బ్రహ్మోత్సవాలు దగ్గరికి రావడంతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, టెండర్లు, ఇంకా ముఖ్యఅంశాలపై చర్చించడం జరిగింది, సంకష్టహర చతుర్థి ప్రతినెల బంగారు రథోత్సవం నిర్వహించడం జరుగుతుంది, కావున బంగారు రథోత్సవ సేవ ఒక టికెట్ ధర 5,000 రూపాయలు ధర నిర్ణయిస్తూ బోర్డు ప్రతిపాదనలను తీసుకోవడం జరిగింది, తరువాత మోదక ప్రసాదాన్ని భక్తులకు అందించే విధంగా ధర్మకర్తల మండలి ఆమోదం తెలపడం జరిగింది, క్యూ లైన్‌లో వేచియుండు భక్తులకు, మరియు మాడా వీధులలో తిరుగు భక్తులకు త్రాగునీరు అందజేయుటకు నూతనంగా సిబ్బందిని నియమించుకోనడానికి దేవదాయ శాఖ వారు సూచనలు జారీ చేశారు, 2026వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఇంజనీరింగ్ శాఖ టెండర్లకి ఆమోదం తెలుపుతు, ఇంకా వివిధ ముఖ్య అంశాలపై సుదీర్ఘ చర్చలు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో డీఈఓ సాగర్ బాబు, ఇన్చార్జి ఈ.ఈ సతీష్, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు నాగరాజు నాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శివ ప్రసాద్, నరేష్, సతీష్, సుబ్రహ్మణ్యం రెడ్డి, చంద్రకళ, అనసూయ, వసంత, సునీత, రాజ్యలక్ష్మి, కృష్ణవేణి, పద్మలత, ఏఈఓ లు ప్రసాద్, ఎస్వీ కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, ధనంజయ, ధనపాల్, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపర్డెంట్లు కోదండపాణి, ఇంజనీరింగ్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ మాతా పరమేశ్వరి అమ్మవారి జాతర

### అమ్మవారిని దర్శించుకున్న టిడిపి సీనియర్ నాయకులు పెనుబోలు జానకిరామిరెడ్డి





గూడూరు( సింధూర దర్శిని) 23 జూలై నెల్లూరు జిల్లా; చిల్లకూరు మండల పరిధిలోని కడివేడు గ్రామంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న శ్రీ మాతా పరమేశ్వరి అమ్మవారి జాతర కార్యక్రమంలో భాగంగా గురువారం అమ్మవారికి టిడిపి సీనియర్ నాయకులు పెనుబోలు జానకిరామ్ రెడ్డి అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకొని , అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, గ్రామ ప్రజలందరూ ఐక్యతగా కలిసి మెలిసి ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పెనుబోలు సునీల్ కుమార్ రెడ్డి జక్కం రెడ్డి దశరథ రామ్ రెడ్డి, సురేంద్ర రెడ్డి, కురగుండా వెంకయ్య, రావినూతల మహేష్ , కలిచేటి రఘురామయ్య, కలిచేటి రాజేష్, పాల్గొన్నారు.



## నాయకులు అందరూ కలిసి సమిష్టిగా పని చేయాలి

### ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు ( సింధూర దర్శిని) 23 జూలై నెల్లూరు జిల్లా; పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ గురువారం నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2 ఏళ్ళ కూటమి పాలన అభివృద్ధి సంక్షేమం ఇంటింటి ప్రచారం కార్యక్రమంను ఈ నెల 27 వ తేదీ నుండి అందరూ కలసి సమిష్టిగా పనిచేయాలని పార్టీ కార్యాలయం నందు నాయకులతో సమీక్షా సమావేశ నిర్వహించి తెలిపారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, నెల బల్లి భాస్కర్ రెడ్డి, గుండాల లీలావతి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, అబ్దుల్ రహీం, గణపర్తి కిషోర్ నాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నేడు జరిగే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

మదనపల్లె ( సింధూర దర్శిని) : కేంద్ర ప్రభుత్వం విద్యార్థులపై చేసిన నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంధ్ర ప్రధాన్ రాజీనామా చేయాలానే డిమాండ్ తో శుక్రవారం జరిగే విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కార్తీక్ విద్యార్థులకు పిలిపునిచ్చారు. గురువారం మదనపల్లె బిటి కాలేజీ విద్యార్థులతో కలిసి కాలేజ్ వద్ద ఆందోళన నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్ష ప్రశ్నా పత్రం లీకేజీ కి భాద్యత వహిస్తూ దర్మేంద్ర ప్రధాన్ ను ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. అంటే లీకేజిని కేంద్ర ప్రభుత్వం సమర్థిస్తున్నట్లా అని అన్నారు. 6 లక్షలకు పైగా విద్యార్థులు రాత్రిపగలు చదువుకొని పరీక్ష రాస్తే ఆశాబంగం కలిగించారని, లీకేజి పేరుతో విద్యాశాఖ మంత్రి మాత్రం ఏమి తెలియనట్లు వ్యవహరించినా, కేంద్రం కూడా మద్దతుగా ఉందన్నారు. ఈ లీకేజి వలన చాలా మంది విద్యార్థులు మనోవేదన తో ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఇదేమని ప్రశ్నిస్తూ ఢిల్లీ లో విద్యార్థులు ఆందోళనలు చేస్తుంటే వారిపైన గుండాయిజం చేస్తూ కేంద్రం విద్యార్థులపైనే దాడులు చేయడమే కాకుండా అనేకమంది పైన కేసులు పెట్టిందన్నారు. దీనిపైన దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నా కేంద్రం సిగ్గు లేకుండా ప్రవర్తిస్తూ, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామాలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. అందుకోసమనే నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని విద్యాసంస్థల బంద్ విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు బంద్ కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.



# హిట్లర్ పుట్టిన ఇల్లు ఇకపై పోలీస్ స్టేషన్..

ఆస్ట్రియా ప్రభుత్వం కీలక నిర్ణయం

హిట్లర్ పుట్టిన ఇంటిని పోలీస్ స్టేషన్‌గా మార్చిన ఆస్ట్రియా ప్రభుత్వం

నియో-నాజీలకు యాత్రాస్థలంగా మారకుండా నిరోధించడమే లక్ష్యం

20 మిలియన్ యూరోల భారీ వ్యయంతో భవనం పునరుద్ధరణ

ప్రభుత్వ నిర్ణయంపై మిశ్రమ స్పందనలు, హక్కుల సంఘాల విమర్శలు

చరిత్రను మరుగునపరిచే ప్రయత్నమంటూ పలువురి ఆరోపణ

జర్మన్ నియంత, లక్షలాది మంది మరణానికి కారణమైన అడాల్ఫ్ హిట్లర్ పుట్టిన ఇంటిని ఆస్ట్రియా ప్రభుత్వం పోలీస్ స్టేషన్‌గా మార్చింది. నయా-నాజీలకు, తీవ్రవాద భావజాలం ఉన్నవారికి ఈ భవనం ఒక పుణ్యక్షేత్రంగా మారకుండా నిరోధించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. సుదీర్ఘకాలం పాటు కొనసాగిన వివాదాలకు ముగింపు పలుకుతూ, పునరుద్ధరించిన ఈ భవనాన్ని జూలై 22న అధికారికంగా ప్రారంభించారు. ఆస్ట్రియాలోని బ్రానో అమ్ ఇన్ పట్టణంలో, జర్మనీ సరిహద్దుకు సమీపంలో ఉన్న ఈ ఇంట్లో హిట్లర్ 1889లో జన్మించాడు. అయితే, అతను ఇక్కడ కొద్ది కాలం మాత్రమే నివసించాడు. నాజీల పాలనలో ఈ భవనాన్ని ఒక స్మారక చిహ్నంగా, ఆర్ట్ మ్యూజియంగా మార్చారు. నాజీల పతనం తర్వాత, ఈ భవనం నయా-నాజీలకు ఆకర్షణ కేంద్రంగా మారింది. ఏటా హిట్లర్ పుట్టినరోజున ఇక్కడికి వచ్చి నివాళులర్పించడం వివాదాలకు దారితీసింది.

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం, ఆస్ట్రియా ప్రభుత్వం 2017లో ఈ భవనాన్ని చట్టపరంగా బలవంతంగా స్వాధీనం చేసుకుంది. అనంతరం, సుమారు 20మిలియన్ యూరోలకు పైగా భారీవ్యయంతో దీనిని పునరుద్ధరించి, పోలీస్ స్టేషన్‌గా మార్చింది. భవనం ముందు ఇప్పుడు కేవలం 'పోలీస్' అనే బోర్డు మాత్రమే కనిపిస్తుంది. హిట్లర్‌కు సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు లేకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. అయితే, భవనం బయట గతంలోనే ఏర్పాటు చేసిన 'మరోసారి ఫాసిజం వద్దు' అని రాసి ఉన్న స్మారక శిలను మాత్రం అలాగే ఉంచారు. ప్రభుత్వ నిర్ణయంపై స్థానిక అధికారులు, ప్రజల నుంచి ఎక్కువగా మద్దతు లభిస్తోంది. దీనివల్ల ఈ ప్రాంతంలో వివాదాలు సమసిపోతాయని, ప్రశాంతత నెలకొంటుందని వారు ఆశిస్తున్నారు. అయితే, ఈ నిర్ణయంపై విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. హోలోకాస్ట్ (యూదులపై సాగించిన దారుణ మారణహోమం) బాధితుల సంఘమైన 'మౌతాసెన్ కమిటీ' వంటి సంస్థలు ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. చరిత్రను గుర్తుచేసుకుని, భవిష్యత్ తరాలకు దాని తీవ్రతను తెలియజేయడానికి బదులుగా, దానిని పూర్తిగా మరుగునపరిచే ప్రయత్నం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు బదులుగా ఈ భవనాన్ని ఒక చారిత్రక మ్యూజియం లేదా విద్యా కేంద్రంగా మార్చి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ చర్య ద్వారా, వివాదాస్పద చారిత్రక ప్రదేశాలను రోజువారీ వినియోగంలోకి తేవడం ద్వారా వాటి ప్రాధాన్యతను తగ్గించాలన్న ఆస్ట్రియా వ్యూహం స్పష్టమవుతోంది.

# చిన్న సినిమాల్లోనే దమ్ముంటుంది: 'కర్మాఖ్య' ఈవెంట్‌లో విజయశాంతి

వినూత్న కథలతో వచ్చే చిన్న సినిమాలకు ప్రోత్సాహం కావాలన్న విజయశాంతి

చిన్న సినిమాలకు మీడియా సహకారం అవసరమని వ్యాఖ్య

రాజకీయాల్లో బిజీ వల్ల తనకు నటించే ఆలోచన లేదని వెల్లడి



కొత్త ఆలోచనలు, వినూత్న కథలతో వచ్చే చిన్న సినిమాలకు ప్రేక్షకులు, మీడియా నుంచి మరింత ప్రోత్సాహం అందాల్సిన అవసరం ఉందని ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు విజయశాంతి అభిప్రాయ పడ్డారు. అలాంటి చిత్రాలకు సరైన గుర్తింపు దక్కితే తెలుగు సినీ పరిశ్రమ మరింత బలోపేతం అవుతుందని స్పష్టం చేశారు. 'అదిరే అభి' (అభినయ కృష్ణ) దర్శకత్వంలో తెరకెక్కిన 'కర్మాఖ్య' సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయశాంతి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వేడుకలో విజయశాంతి మాట్లాడుతూ... "పెద్ద సినిమాలతో పోలిస్తే చిన్న చిత్రాలకు లభించే మద్దతు కాస్త తక్కువే అయినప్పటికీ, నిజమైన దమ్ము, కొత్తదనం, బలమైన కథలు చిన్న సినిమాల్లోనే ఉంటాయి. ప్రేక్షకులు ఇలాంటి వైవిధ్యమైన ప్రయత్నాలను ఆదరిస్తే పరిశ్రమకు మరింత మంది కొత్త నటీనటులు, దర్శకులు వస్తారు. ముఖ్యంగా చిన్న సినిమా నిర్మాతలు నిలదొక్కుకోవాలంటే మీడియా సహకారం చాలా అవసరం. కొత్త కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లడంలో మీడియానే కీలక పాత్ర పోషిస్తుంది" అని పేర్కొన్నారు. 'కర్మాఖ్య' సినిమాలో నటించిన అభినయ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ... ఈ పాత్ర కోసం ఆమె గుండు చేయించుకోవాల్సిన అవసరం లేదని, కానీ కథపై ఉన్న అంకితభావంతోనే అలా చేశారని విజయశాంతి అభినందించారు. ఆమె పడిన కష్టానికి ప్రేక్షకులు కచ్చితంగా పెద్ద విజయాన్ని అందిస్తారనే నమ్మకం ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఇక తన నటన కెరీర్ పై స్పందిస్తూ... ప్రస్తుతం తాను రాజకీయాల్లో బిజీగా ఉన్నందున నటించే ఆలోచన లేదని... అయితే బలమైన కథ, గుర్తుండిపోయే మంచి పాత్ర వస్తే మాత్రం ఆలోచిస్తానని వెల్లడించారు. కాగా, ఎంతో ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ 'కర్మాఖ్య' చిత్రం జూలై 31న థియేటర్లలోకి రానుంది.

# నాడు విమాన భద్రతకు నాంది పలికిన ఘటన..

74 ఏళ్ల తర్వాత వెలుగులోకి వచ్చిన ప్రమాద శకలాలు - 1952 కూలిన పాన్ ఆమ్ విమానం

ఈ ప్రమాదంలో 69 మందిలో 52 మంది ప్రాణాలు కోల్పోయిన వైనం

సముద్ర గర్భంలో 2000 అడుగుల లోతులో శకలాలను కనుగొన్న బృందం

ఈ ఘటనే విమానాల్లో భద్రతా సూచనలకు నాంది



విమానయాన చరిత్రలోనే ఒక కీలకమైన, విషాదకరమైన అధ్యాయం 74 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ వెలుగులోకి వచ్చింది. 1952లో అట్లాంటిక్ మహాసముద్రంలో కూలిపోయి, 52 మంది మృతికి కారణమైన పాన్ అమెరికన్ ఎయిర్‌వేస్ 'క్లిప్పర్ ఎండీవర్' విమాన శకలాలను పరిశోధకులు ఇటీవల సముద్ర గర్భంలో కనుగొన్నారు. ఈ ఆవిష్కరణ ఏడు దశాబ్దాల నాటి గాయాలను గుర్తు చేయడమే కాకుండా, నేటి ఆధునిక విమానయాన భద్రతా ప్రమాణాల వెనుక ఉన్న చేదు నిజాలను కళ్లముందు ఉంచింది.

### ఏం జరిగింది?

1952, ఏప్రిల్ 11న ప్యూర్టోరికోలోని శాన్ జువాన్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే 'క్లిప్పర్ ఎండీవర్' డగ్లస్ డీసీ-4 విమానంలోని నాలుగు ఇంజిన్లలో రెండు విఫలమయ్యాయి. దీంతో పైలట్లు విమానాన్ని తీరానికి ఐదు మైళ్ల దూరంలో సముద్రంలో అత్యవసరంగా ల్యాండ్ (డిచింగ్) చేశారు. అయితే, సముద్రపు అలల ఉద్ధృతికి విమానం కేవలం మూడు నిమిషాల్లోనే పూర్తిగా మునిగిపోయింది. ఆ సమయంలో విమానంలో 69 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉండగా.. తీవ్ర గందరగోళం నెలకొంది. చాలామందికి లైఫ్ జాకెట్లు ఎలా ఉపయోగించాలో తెలియకపోవడంతో నీటిలో మునిగిపోయారు. ఈ ఘోర దుర్ఘటనలో 17 మంది మాత్రమే ప్రాణాలతో బయటపడగా, 52 మంది ప్రాణాలు కోల్పోయారు.

### అత్యాధునిక టెక్నాలజీతో గుర్తింపు

ఎయిర్/సీ హెరిటేజ్ ఫౌండేషన్, డీప్ సీ విజన్ బృందాలు కలిసి 2026 జూన్ 2న ఈ చారిత్రక అన్వేషణను విజయవంతం చేశాయి. పాత రికార్డులు, మ్యాపులు, వాతావరణ సమాచారం ఆధారంగా అత్యాధునిక సోనార్ టెక్నాలజీతో కూడిన అటానమస్ అండర్‌వాటర్ డ్రోన్‌తో గాలించారు. సుమారు 2000 అడుగుల (610 మీటర్లు) లోతులో రెండు ముక్కలుగా విరిగిపడి ఉన్న విమాన శకలాలను గుర్తించారు. వాటిపై 'పాన్ యామ్' లోగో, 'క్లిప్పర్ ఎండీవర్' అనే పేరు ఇప్పటికీ స్పష్టంగా కనిపిస్తున్నాయని పరిశోధకులు తెలిపారు.

### విమాన భద్రతకు నాంది పలికిన ఘటన

ఈ ప్రమాదం విమానయాన రంగంలో భద్రతా ప్రమాణాలపై తీవ్ర చర్చకు దారితీసింది. అత్యవసర సమయాల్లో ప్రయాణికులను ఎలా అప్రమత్తం చేయాలనే దానిపై దృష్టి సారించేలా చేసింది. ఈ ఘటన తర్వాతే ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య విమానాల్లో ప్రయాణానికి ముందు భద్రతా సూచనలు (సేఫ్టీ బ్రీఫింగ్స్) తప్పనిసరిగా ఇవ్వాలనే నియమాన్ని ప్రవేశపెట్టారు. మెరుగైన లైఫ్ జాకెట్లు, అత్యవసర పరికరాల రూపకల్పనకు ఈ దుర్ఘటనే పునాది వేసిందని నిపుణులు చెబుతున్నారు. ఈ అన్వేషణకు సంబంధించిన పూర్తి వివరాలను డిస్కవరీ ఛానెల్‌లోని 'ఎక్స్‌పెడిషన్ అన్‌నౌన్' ప్రత్యేక ఎపిసోడ్‌లో ప్రసారం చేయనున్నారు. ఈ ఆవిష్కరణ మృతుల కుటుంబాలకు ఒక స్మారక చిహ్నంగా నిలుస్తుందని, అలాగే ఎంహెచ్370 వంటి అదృశ్యమైన ఇతర విమానాల ఆచూకీ కనుగొనడంలో కొత్త ఆశలు రేకెత్తిస్తుందని భావిస్తున్నారు.

# పెట్రోల్‌లో 20శాతానికి మించి ఇథనాల్..? కేంద్రం క్లారిటీ

శాస్త్రీయ అధ్యయనాల తర్వాతే నిర్ణయమన్న మంత్రి -ఈ85 ఇంధనం ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలకే

ఈ20 వల్ల ఇంజిన్ సమస్యలకు ఆధారాలు లేవన్న సురేశ్ గోపీ

20 కోట్ల ద్విచక్ర వాహనాలు, 3 కోట్ల కార్లు ఈ20పై నడుస్తున్నట్లు వెల్లడి

ఈ20తో కాలుష్యం తగ్గి పనితీరు మెరుగుపడుతుందని స్పష్టీకరణ



పెట్రోల్‌లో ప్రస్తుతం అమల్లో ఉన్న 20 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని మరింత పెంచే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనిపై భవిష్యత్తులో నిర్ణయం తీసుకునే ముందు శాస్త్రీయ అధ్యయనాలు, సాంకేతిక పరిశీలనలు, అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపింది. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆటోమొబైల్ తయారీ సంస్థలు, చమురు మార్కెటింగ్ కంపెనీలు, పరిశోధనా సంస్థలతో సంప్రదింపులు జరిపిన తర్వాతే తదుపరి నిర్ణయం ఉంటుందని పేర్కొన్నారు. 85 శాతం ఇథనాల్, 15 శాతం పెట్రోల్‌తో కూడిన 'ఈ85' ఇంధనాన్ని కేవలం ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల కోసం మాత్రమే ప్రవేశపెట్టామని, ఇది దేశవ్యాప్తంగా పెట్రోల్‌లో ఇథనాల్ శాతాన్ని పెంచినట్లు కాదని మంత్రి వివరణ ఇచ్చారు. భారత్‌లో ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ కార్యక్రమాన్ని నీతి ఆయోగ్, ఏఆర్ఏఐ, సియామ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం, చమురు సంస్థలు తదితర సంస్థల సలహాలతో శాస్త్రీయంగా అమలు చేస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకుపైగా పెట్రోల్ కార్లు 'ఈ20' ఇంధనాన్ని వినియోగిస్తున్నప్పటికీ, ఇథనాల్ కారణంగా ఇంజిన్ దెబ్బతిన్నట్లు లేదా అసాధారణ సమస్యలు తలెత్తినట్లు ఎలాంటి నిర్ధారిత ఆధారాలు లేవని కేంద్రం వెల్లడించింది. వాహన తయారీ సంస్థలు కూడా ఈ20 వాడుతున్న వాహనాలకు వారంటీ కొనసాగిస్తున్నాయని పేర్కొంది. ఈ20 ఇంధనం వల్ల కొంతమంది పాత వాహనాల్లో ఇంధన సామర్థ్యం 3 నుంచి 5 శాతం వరకు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, మెరుగైన దహన ప్రక్రియ, తక్కువ కాలుష్యం, మంచి యాక్సిలరేషన్ వంటి ప్రయోజనాలు ఉన్నాయని మంత్రి తెలిపారు.

ఇథనాల్ మిశ్రమ కార్యక్రమం వల్ల ఇప్పటివరకు రూ.1.97 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా కావడంతో పాటు 316 లక్షల మెట్రిక్ టన్నుల ముడి చమురు దిగుమతులు తగ్గాయని తెలిపారు. 952 లక్షల మెట్రిక్ టన్నుల కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు రైతులకు రూ.1.66 లక్షల కోట్లకు పైగా ఆదాయం చేరిందని కేంద్రం వెల్లడించింది.

# నాలుగో రోజూ తప్పని నష్టాలు.. సెన్సెక్స్ 364 పాయింట్లు డౌన్

నిఫ్టీ 127 పాయింట్లు పతనం

76,391.39 వద్ద బీఎస్ఈ , 23,869.60 వద్ద స్థిరపడ్డ ఎన్ఎస్ఈ

అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో పెరిగిన చమురు ధరలు

బ్యాంకింగ్, రియాల్టీ షేర్లపై అమ్మకాల ఒత్తిడి

స్వల్ప లాభాల్లో ముగిసిన ఆటో రంగ షేర్లు



అమెరికా-ఇరాన్ మధ్య తాజా ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం భారత స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో దేశీయ సూచీలు వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో ముగిశాయి. గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 364 పాయింట్లు పడిపోయి 76,391.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 127 పాయింట్లు కోల్పోయి 23,869.60 వద్ద స్థిరపడింది. నిఫ్టీ-50 సూచీలో ఎస్‌బీఐ లైఫ్, బజాజ్ ఆటో, ఎంఅండ్ఎం, టీసీఎస్, టాటా కన్స్యూమర్స్ షేర్లు లాభపడ్డాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, నెస్లే ఇండియా, శ్రీరామ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ షేర్లు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బ్యాంకింగ్, రియాల్టీ, చమురు సంబంధిత షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది. నిఫ్టీ రియాల్టీ సూచీ 1.81శాతం క్షీణించగా, పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 1 శాతం, నిఫ్టీ బ్యాంక్ 0.94 శాతం చొప్పున పడిపోయాయి. కెమికల్, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు కూడా నష్టాల్లో ముగిశాయి. అయితే ఆటో రంగం కొంత మెరుగ్గా రాణించింది. నిఫ్టీ ఆటో సూచీ 0.70 శాతం లాభపడగా, మీడియా సూచీ కూడా స్వల్ప లాభాల్లో ముగిసింది. పశ్చిమాసియాలోని భౌగోళిక ఉద్రిక్తతలు, పెరుగుతున్న ముడి చమురు ధరలు.. ద్రవ్యోల్బణం, కార్పొరేట్ లాభాలపై ప్రభావం చూపవచ్చనే ఆందోళనతో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించినట్లు మార్కెట్ నిపుణులు తెలిపారు.

## మీరు ఉదయం అరగంట నడిస్తే


# మీకు కనీసం పది ప్రయోజనాలు



సైన్స్ అండ్ టెక్నాలజీ జీవితాన్ని ఎంతగానో ఆధునీకరించాయి. మనమందరం ఇప్పటికీ టెక్నాలజీ ఉచ్చులో చిక్కుకున్నాము. సాంకేతికత మన రోజువారీ పది పనులను సులభతరం చేస్తున్నందున, యంత్రాలకు అవసరం లేని అన్ని శారీరక పనులను మనం నియంత్రించుకుంటాము. మన వృద్ధాప్యంలో, ప్రజలు ఎక్కువగా ఆరోగ్యంగా ఉండాలి మరియు ఆరోగ్యం మరియు ఫిట్నెస్ కోసం విడిగా సమయం మరియు డబ్బు ఖర్చు చేయవలసిన అవసరం లేదు. ఇప్పుడు ప్రాణాంతకమని నిరూపించబడిన వ్యాధులు చాలా అరుదు. మన పెద్దలు ఆరోగ్యంగా ఉన్నందున, వారి ఆహారం సేంద్రీయమైనది మరియు వారు తగినంత ఆహారాన్ని తినడం లేదు. మన పూర్వీలు చాలా కష్టపడేవారు మరియు వారికి నడక మరియు వ్యవసాయ ఆధారిత వ్యాయామాలు తప్ప వేరే వ్యాయామం తెలియదు. నడక అనేది మనిషి శరీరానికి అత్యంత సరైన వ్యాయామం. ఏదైనా ఇతర బాడీబిల్డింగ్ వ్యాయామం శరీరంపై అనారోగ్య ఒత్తిడిని కలిగిస్తుంది. అందువల్ల, మీరు కృత్రిమ ఆరోగ్యం కాకుండా రోజుకు



కేవలం ముప్పై నిమిషాలు నడవడం ద్వారా సాధారణ ఆరోగ్యం మరియు ఫిట్‌నెస్‌ను సాధించవచ్చు, వీటిని ఖరీదైన వ్యాయామ పరికరాలు, జిమ్ లు మరియు మరెన్నిటి ద్వారానో సాధించవచ్చు. నడకతో సాధారణ అనుభూతి చెందారా? నడక శరీరంలోని అన్ని కండరాలకు మంచి వ్యాయామం ఇస్తుంది మరియు ఎక్కువ కేలరీలను బర్న్ చేయడానికి సహాయపడుతుంది. మన జీవితంలో సరళమైన విషయాలు గొప్ప ఆనందాన్ని అందించినట్లే, సాధారణ వ్యాయామాలు మన ఆరోగ్యానికి గొప్పప్రయోజనాన్ని అందిస్తాయి. కాబట్టి నడక ఆరోగ్యానికి కీలకం అని సులభంగా చెప్పవచ్చు. రండి, అరగంట నడక యొక్క మొదటి పది ప్రయోజనాలను పరిశీలిద్దాం ... నడక మన హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది క్రమం తప్పకుండా నడవడం వల్ల మన హృదయ స్పందన రేటు కొద్దిగా పెరుగు తుంది. కానీ అతిగా కాదు. ఇది ప్రసరణను కొంచెం మెరుగుపరుస్తుంది, కానీ శ్వాస అంత వేగంగా కాదు. కాబట్టి కొంచెం ఎక్కువ ప్రసరణ గుండెపై ఎక్కువ ఒత్తిడి చేయకుండా రక్తపోటును ఆరోగ్యకరమైన పరిమితుల్లో ఉంచడానికి సహాయపడుతుంది. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది మరియు మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. జీవరసాయన క్రియను









ఉత్తమంగా ఉంచుతుంది నడక జీర్ణవ్యవస్థను అవసరమైనంతగా ప్రేరేపిస్తుంది మరియు ఎక్కువ జీర్ణ అవసరాలను జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. ఇది ఆహారాన్ని పూర్తిగా జీర్ణం చేయడానికి మరియు తద్వారా జీవరసాయన పనితీరును మెరుగుపరచడానికి సహాయపడుతుంది. విరేచనాలతో నిండిన ఆహారాలు జీర్ణక్రియ మరియు దానితో వచ్చే సమస్యల నుండి మిమ్మల్ని రక్షిస్తాయి. ఎముకలు బోలు

సమస్యల నుండి రక్షిస్తుంది ఎముకలు సాధారణ నడక ద్వారా స్థిరీకరించబడతాయి మరియు సులభంగా చిరిగి పోకుండా కాపాడుతుంది. శరీరంలో అధిక విటమిన్ డి 3 ఉత్పత్తి అవుతుంది, ముఖ్యంగా సూర్యుని యువ కిరణాలు తీసుకున్నప్పుడు. ఈ విటమిన్ ఆహారంలో కాల్షియం మొత్తాన్ని గ్రహించడంలో సహాయపడు తుంది. ఇది ఎముకల ఎముకలలో మజ్జ ఎండిపోకుండా నిరోధి స్తుంది. ఇది ఆర్థరైటిస్ నుండి రక్షణను అందిస్తుంది. కండరాలు గట్టిగా ఉండటానికి సహాయపడు తుంది రోజుకు ఒకసారి నడవడం కండరాలను నిర్మించడానికి మరియు శరీరంలో కండరాల–కొవ్వు నిష్పత్తిని పెంచడానికి సహాయపడుతుంది. ఫలితం వక్రీకృత కండరాలను పొందగలుగుతుంది. తొడలు మరియు ముంజేయి యొక్క కండరాలు, ముఖ్యంగా, వ్యాయామ పాఠశాలల్లో కంటే చెమట మరియు అలసటతో మెరుగ్గా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది నడక మన శరీరంలో ఎక్కువ తెల్ల రక్త కణాలను ఉత్పత్తి చేస్తుంది మరియు తద్వారా రోగ నిరోధక శక్తిని మెరుగుపరు స్తుంది. రోజూ క్రమం తప్పకుండా మరియు ఒక రోజు లేకుండా అరగంట పాటు నడిచే రోగులు చాలా ఆరోగ్యంగా.. ఉత్తమంగా ఉంటారు మరియు జలుబు మరియు దగ్గు జ్వరం వచ్చే ఇతరులకన్నా తక్కువ. మెదడు కండరాలను ప్రేరేపిస్తుంది నడవడం ద్వారా మెదడు కణాల కార్యకలాపాలను పెంచుతుంది. మెదడు కణజాల నష్టం మరియు వినికిడి నష్టం మరియు జీవన నాణ్యత కోల్పోకుండా

జ్ఞాపకశక్తి కోల్పోకుండా కాపాడుతుంది. క్రమం తప్పకుండా నడవడం జ్ఞాపకశక్తిని మెరుగు పరుస్తుంది మరియు అల్జీమర్స్ వ్యాధి, మెదడు రుగ్మతతో సహా ఇతర వ్యాధుల నుండి రక్షిస్తుంది. అప్రమత్తంగా ఉండటానికి మీకు సహాయపడుతుంది రొటీన్ నడక ద్వారా అనేక అనారోగ్యాలను నివారించవచ్చు. తద్వారా శరీరం మరియు మనస్సు మంచి స్థితిలో ఉంటాయి మరియు నడక ద్వారా





అదనపు ప్రసరణ ద్వారా రక్త ఆక్సిజన్‌ను తీసుకువెళ్ళే సామర్థ్యం ఉంటుంది. అధిక ఆక్సిజన్ అధిక కార్యాచరణ మరియు అప్రమత్తతను నిర్వహించడానికి సహాయపడు తుంది. శరీరం నుండి మలినాలను తొలగించడానికి సహాయపడుతుంది మన శరీర కండరాలన్నీ కదలికలో ఉన్నప్పుడు, ఇతర అవయవాలు మలినాలను కరిగించడంలో పాల్గొంటాయి. నడక సమయంలో, ప్రేగులలో కార్యకలాపాలు వేగవంతమవు తాయి మరియు మలినాలు పెద్ద ప్రేగులోకి కదులుతాయి. మలినాలను శరీరం నుండి విడుదల చేసినప్పుడు, శరీరం యొక్క సామర్థ్యం పెరుగుతుంది. నడక మనకు సంతోషాన్ని ఇస్తుంది మీ ఇంటికి సమీపంలో ఉన్న పార్కులో లేదా మీకు ఇష్టమైన ప్రదేశంలో ప్రతిరోజూ అరగంట పాటు నడవడం మనస్సు యొక్క ఒత్తిడిని తగ్గిస్తుంది మరియు మెదడులో ఆక్సిటోసిన్ ఉత్పత్తి చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గిస్తుంది. తత్ఫలితంగా, నిరాశకు గురయ్యే అవకాశం తక్కువ. మనస్సు యొక్క స్థితిని తొలగిస్తుంది మరియు మీకు సుఖంగా ఉండటానికి సహాయపడుతుంది. బలాన్ని పెంచుతుంది ఒక అధ్యయనం ప్రకారం అరగంట క్రమం తప్పకుండా నడుస్తూ ఆరోగ్య కరమైన ఆహారనియమాలు పాటించేవారు ఇతరులకన్నా ఐదు నుంచి ఏడు సంవత్సరాలు తక్కువ వయస్సున్న వారిలా కనబడుతారు.

కొన్ని అనారోగ్యాలు నడకతో కప్పబడవు, అందుకే అవి బరువు తగ్గుతారు. రెగ్యులర్ అరగంట నడక శరీర బరువును తగ్గిస్తుంది మరియు జీవితాన్ని పూర్తిస్థాయిలో జీవించటానికి మిమ్మల్ని అనుమతిస్తాయి. ఈ కథనాన్ని మీ స్నేహితులతో పంచుకోండి, తద్వారా వారు ఈ వ్యాసంలో ఉపయోగ కరమైన సమాచారాన్ని పొందవచ్చు.

# జింబాబ్వేతో తొలి టీ20: టాస్ గెలిచిన భారత్.. జట్టులోకి కొత్త ఫాస్ట్ బౌలర్

**టీ20 అరంగేట్రం చేసిన అశోక్ శర్మ – జింబాబ్వేలో బెన్ కరన్, న్యామ్‌హురి టీ20 డెబ్యూ**

**టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్ – పిచ్‌పై బౌన్స్ ఉంటుందని శ్రేయస్ అంచనా**

**తర్వాత బ్యాటింగ్‌కు అనుకూలంగా మారుతుందన్న జింబాబ్వే కెప్టెన్ – హరారేలో జరుగుతున్న తొలి టీ20**

హరారే వేదికగా జింబాబ్వేతో గురువారం ప్రారంభమైన తొలి టీ20లో భారత జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్‌తో యువ ఫాస్ట్ బౌలర్ అశోక్ శర్మ భారత జట్టు తరఫున అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేశాడు.

పిచ్‌పై బౌన్స్ ఉండే అవకాశం కనిపిస్తోందని, అందుకే ముందుగా బౌలింగ్ చేయాలని నిర్ణయించామని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తెలిపాడు. జింబాబ్వే గత కొన్నేళ్లుగా మంచి క్రికెట్ ఆడుతోందని, తమ బలాలను సమర్థంగా ప్రదర్శిస్తోందని ప్రశంసించాడు.




మరోవైపు జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా మాట్లాడుతూ ఈ పిచ్ సాధారణ హరారే వికెట్‌లా లేదని, ఆరంభంలో బౌలర్లకు కొంత సహకరించినా తర్వాత బ్యాటింగ్‌కు అనుకూలంగా మారుతుందని అభిప్రాయపడ్డాడు. బంగ్లాదేశ్‌తో సిరీస్‌లో ఓడినా తమ జట్టులో ఎన్నో సానుకూల అంశాలు కనిపించాయని చెప్పాడు. ఈ మ్యాచ్‌లో జింబాబ్వే తరఫున బెన్ కరన్, న్యూమన్ న్యామ్‌హురి కూడా టీ20 అరంగేట్రం చేశారు. బెన్ కరన్ ఎవరో కాదు... ఇంగ్లండ్ క్రికెటర్లు శామ్ కరన్, టామ్ కరన్ ల సోదరుడే. వీరి తండ్రి కెవిన్ కరన్ జింబాబ్వే మాజీ క్రికెటర్. భారత్ జట్టు: వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, రింకూ సింగ్, శివమ్ దూబే, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్

జింబాబ్వే జట్టు: బ్రియాన్ బెన్నెట్, తడివానాశే మరుమాని, బెన్ కరన్, డియాన్ మైయర్స్, సికందర్ రజా (కెప్టెన్), ర్యాన్ బర్ల్, వెస్లీ మధెవెరే, బ్రాడ్ ఎవాన్స్, న్యూమన్ న్యామ్‌హురి, రిచర్డ్ ఎన్‌గరవా, బ్లెస్సింగ్ ముజరబాని.

# ఇన్ఫోసిస్ తదుపరి సీఈవోగా ఆశిష్ కుమార్ దాష్.. 2027 నుంచి బాధ్యతలు

దేశంలోని రెండో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్‌లో కీలక నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. కంపెనీ తదుపరి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా ఆశిష్ కుమార్ దాస్ నియమితులయ్యారు. ప్రస్తుత సీఈవో సలీల్ పరేఖ్ స్థానంలో ఆయన 2027 ఏప్రిల్ 1 నుంచి పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరిస్తారు. గురువారం జరిగిన సమావేశంలో నామినేషన్ అండ్ రెమ్యూనరేషన్ కమిటీ సిఫార్సుల మేరకు కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఈ నియామకానికి ఆమోదముద్ర వేశారు. ఆశిష్ దాస్ తక్షణమే సీఈవో డెజిగ్నేట్‌గా బాధ్యతలు చేపట్టి, నాయకత్వ మార్పు ప్రక్రియలో భాగస్వాములవుతారు. ఈ నియామకానికి వాటాదారుల మరియు చట్టపరమైన నియంత్రణ సంస్థల అనుమతులు లభించాల్సి ఉంది. ఇన్ఫోసిస్‌లో దాదాపు మూడు దశాబ్దాలు అనుభవం ఉన్న ఆశిష్, సంస్థ చేపట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పరివర్తన ప్రయత్నాల్లో కీలక పాత్ర పోషించారు. ఈ నియామకంపై ఇన్ఫోసిస్ బోర్డు ఛైర్మన్ నందన్ నీలేకని స్పందిస్తూ, కంపెనీ విలువలను కాపాడుతూనే,సమకాలీన అవసరాలకు అనుగుణంగా





సాహసోపేతమైన మార్పులు తీసుకురాగల సమర్థవంతమైన నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. బోర్డు తనపై ఉంచిన నమ్మకానికి ఆశిష్ దాస్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత సీఈవో సలీల్ పరేఖ్ ఈ పరిణామాన్ని స్వాగతించారు. నాయకత్వ బదిలీ ప్రక్రియ అత్యంత సజావుగా సాగుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇదే సమావేశంలో అర్హులైన నూతన ఉద్యోగులకు 9,836 రెస్ట్రిక్టెడ్ స్టాక్ యూనిట్లను (ఆర్ఎస్‌యూలు), ఇతర ఉద్యోగులకు సుమారు 4.78 లక్షల ఈక్విటీ షేర్లను కేటాయించేందుకు కూడా బోర్డు ఆమోదం తెలిపింది.

# సినిమా న్యూస్



ప్రకృతి పావని బికినీ బ్లిస్: సన్, సాండ్, మరియు స్టైల్ ఆమె కెమెరా ముందు పూర్తిగా ప్రశాంతంగా కనిపించింది, ప్రతి క్లిక్‌ని చిత్రంగా పరిపూర్ణంగా మార్చే రిలాక్స్డ్, బీచ్ వైబ్‌లను వెదజల్లింది.

## మారుతోన్న పాన్-ఇండియా మార్కెట్ వ్యూహాలు!




నాలుగైదేళ్ల క్రితంపాన్-ఇండియా అనే పదం భారీ బడ్జెట్ సినిమాలు, అగ్ర హీరోల చిత్రాలకే పరిమితమై ఉండేది. రాజమౌళి, ప్రశాంత్ నీల్ వంటి దర్శకులు తెరకెక్కించిన పెద్ద ప్రాజెక్ట్‌లతోనే తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల చేసే ట్రెండ్ ఊపందుకుంది. అయితే కాలం మారుతున్న కొద్దీ ఈ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. పాన్ ఇండియా అనేది ఇప్పుడు స్టార్ హీరోలే కాకుండా మీడియం రేంజ్ హీరోలు సైతం తమ సినిమాలను మల్టీ-లాంగ్వేజ్ ఫార్మాట్‌లో విడుదల చేసేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. ఈ మార్పునకు ప్రధాన కారణం ప్రేక్షకుల్లో సినిమాను చూసే దృక్పథం పూర్తిగా మారిపోవడమే. ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌ల రాకతో భాషా బేధాలు పూర్తిగా తొలగిపోయాయి. ఏ భాషలో కంటెంట్ బాగున్నా ? ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఈ విషయాన్ని ముందే గ్రహించిన మీడియం రేంజ్ హీరోలు .. యువ నటులు సొంత మార్కెట్‌కే పరిమితం కాకుండా ఇతర రాష్ట్రాల మార్కెట్లను కూడా టార్గెట్ చేస్తున్నారు. కథాబలం ఉంటే బడ్జెట్‌తో సంబంధం లేకుండా అన్ని భాషల్లోనూ విజయం సాధించొచ్చని పలు చిన్న, మధ్యతరహా సినిమాలు నిరూపించడంతో ఈ ధోరణి మరింత బలపడింది. ఈ కొత్త వ్యూహంలో భాగంగా నిర్మాతలు కేవలం డబ్బింగ్ సినిమాలకే పరిమితం కాకుండా ప్రతి భాషకు తగినట్లుగా ప్రమోషన్స్ చేయడం, అక్కడి స్థానిక నటీనటులను భాగస్వామ్యం చేయడం వంటి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తద్వారా సినిమాకు అన్ని ప్రాంతాల్లోనూ కనెక్టివిటీ పెరుగుతోంది. భారీ తారల చిత్రాలతో వచ్చే బిగ్గెస్ట్ క్లాషెస్‌ను తప్పుకుంటూ కంటెంట్ ఉన్న మీడియం సినిమాలతో థియేటర్లలో సులువుగా నిలదొక్కుకోవచ్చనేది నిర్మాతల ఆలోచనగా మారుతోంది. ఇది భవిష్యత్తులో బాక్సాఫీస్ సమీకరణాలను పూర్తిగా మార్చేసే బలమైన అవకాశం ఉంది. పెద్ద హీరోల సినిమాలతో సంబంధం లేకుండా ఏడాది పొడవునా బాక్సాఫీస్ వద్ద స్థిరమైన వసూళ్లు వచ్చేలా ఈ వ్యూహం దోహదపడుతుంది. అంతేకాదు మీడియం రేంజ్ హీరోల మార్కెట్ పరిధి పెరగడం వల్ల నిర్మాతలు పెట్టే పెట్టుబడులకు మరింత భద్రత చేకూరుతుంది. తక్కువ రిస్క్‌తో ఎక్కువ లాభాలు సాధించే వ్యాపార మార్గంగా రూపాంతరం చెందుతోంది. అయితే ఈ పాన్-ఇండియా ప్రయాణంలో సవాళ్లు లేకపోలేదు. ప్రతి భాషలోని సంస్కృతికి, అక్కడి ప్రేక్షకుల రుచికి తగ్గట్టుగా కథను మలచడం కత్తి మీద సాము లాంటిదే. కేవలం అనువాదం చేస్తే సరిపోదు. భావోద్వేగాలు సహజంగా పండేలా చూసుకోవాలి. సరైన ప్రమోషనల్ స్ట్రాటజీ లేకపోతే ఇతర భాషల్లో సినిమాలు నిలదొక్కుకోవడం కష్టమవుతుంది. అయినప్పటికీ యువ హీరోలు రిస్క్ తీసుకునేందుకు వెనుకాడకపోవడం ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టిస్తోంది.

## 'మహేంద్రగిరి వారాహి' రిలీజ్ డేట్ లాక్.. ఆ మూవీకి గట్టి పోటీ తప్పదా?



అక్కినేని కాంపౌండ్ నుండి వచ్చిన హీరో సుమంత్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. విభిన్నమైన జానర్లలో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈయన.. ఒకవైపు హీరోగా, మరొకవైపు విలన్ గా సినిమాలలో నటిస్తూనే.. క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్రలతో కూడా మెప్పిస్తున్నారు. ఇకపోతే తాజాగా ఆధ్యాత్మిక అంశాల నేపథ్యంలో.. విలక్షణమైన చిత్రాలను తెరకెక్కించే దర్శకుడు సంతోష్ జాగర్లమూడి దర్శకత్వంలో సరికొత్త చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అలా ఆధ్యాత్మిక సస్పెన్స్ థ్రిల్లర్ గా రాబోతున్న చిత్రమే మహేంద్రగిరి వారాహి. సస్పెన్స్ థ్రిల్లర్ గా మహేంద్రగిరి వారాహి.. భక్తి ,పురాతన నమ్మకాలు, సైన్స్ అండ్ మిస్టరీ చుట్టూ తిరిగే ఈ ఆధ్యాత్మిక సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ నుండి ఇదివరకే అఫీషియల్ టీజర్ విడుదలై సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తూ.. సినిమాపై అంచనాలు పెంచేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా మహేంద్రగిరి కొండల బ్యాక్ డ్రాప్ లో వారాహి మాత దివ్యశక్తి చుట్టూ అల్లిన ఒక కథతో ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాకి ప్రాణంగా నిలవబోతోందని మేకర్స్ స్పష్టం చేశారు.. ఆధ్యాత్మిక శ్లోకాలతో పాటు థ్రిల్లింగ్ సీన్స్ ను నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్లేలా ఆయన మ్యూజిక్ అందించినట్లు తెలుస్తోంది.. విడుదల తేదీ ఎప్పుడంటే.. ప్రతాప్ ఆర్ కృష్ణ సినిమాటోగ్రఫీ అందించగా.. అన్నపూర్ణ స్టూడియోస్ లో పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా దాదాపు పూర్తయినట్లు తెలుస్తోంది. రాజశ్యామల ఎంటర్టైన్మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక సుమంత్ సరసన మీనాక్షి గోస్వామి హీరోయిన్గా నటిస్తుండగా.. బ్రహ్మానందం, రాజీవ్ కనకాల, మాళవిక నాయర్, వెన్నెల కిషోర్, అలీ లాంటి భారీ తారాగణం ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇక ఈ సినిమా కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అభిమానులకు మేకర్స్ సర్ప్రైజ్ ఇచ్చారు. సెప్టెంబర్ 11వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది అంటూ సోషల్ మీడియాలో బజ్ వినిపిస్తోంది. త్వరలోనే దీనిపై అఫీషియల్ అనౌన్స్మెంట్ వెలువడనుంది.

## మూవీ రివ్యూ : జననాయకుడు




'జననాయకుడు' మూవీ రివ్యూ నటీనటులు: విజయ్- మామిత బైజు- పూజా హెగ్డే- బాబీ డియోల్- ప్రకాష్ రాజ్- ప్రియమణి- నాజర్- సునీల్ తదితరులు సంగీతం: అనిరుధ్ ఛాయాగ్రహణం: సత్యన్ సూర్యన్ మాటలు: హనుమాన్ చౌదరి నిర్మాత: వెంకట్.కె. నారాయణ రచన-దర్శకత్వం: హెచ్.వినోద్ తమిళనాట కొత్త రాజకీయ పార్టీ పెట్టి ముఖ్యమంత్రి అయిన విజయ్ రాజకీయాల్లోకి వచ్చే ముందు చివరగా నటించిన చిత్రం.. జననాయగన్. సెన్సార్ సమస్యల కారణంగా ఆలస్యమై ఎట్టకేలకు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తెలుగులో 'జననాయకుడు' పేరుతో ఈ రోజే విడుదలైన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి. కథ: వెట్రి (విజయ్) ఒక హత్య కేసులో జైల్లో ఖైదీగా ఉంటాడు. అక్కడ తన మీద అభిమానం చూపించిన జైలర్ మీద అతడికి ఎంతో గౌరవం ఉంటుంది. వెట్రి బయటికి వచ్చే సమయానికి ఆ జైలర్ అనుకోకుండా చనిపోవడంతో ఆయన కూతురు విజ్జి (మామిత బైజు) బాధ్యతను తాను తీసుకుంటాడు. ఒక మానసిక సమస్యతో బాధ పడుతున్న విజ్జిని తన తండ్రి కోరిక మేరకు ఎలాగైనా సైనికురాలిని చేయాలని వెట్రి లక్ష్యంగా పెట్టుకుంటాడు. కానీ విజ్జికి అదిష్టం లేకపోయినా వెట్రి కోసం కష్టపడుతుంటుంది. ఇంతలో విజ్జి ఒక పెద్ద ప్రమాదంలో చిక్కుకుంటుంది. జాన్ హిమ్లర్ (బాబీ డియోల్) అనే ఇంటర్నేషనల్ డాన్ వల్ల ఆమెకు ప్రాణాపాయం ఉందని తెలిశాక వెట్రి అతణ్ని ఎదుర్కోవడానికి రంగంలోకి దిగుతాడు. ఇంతకీ ఈ జాన్ హిమ్లర్ ఎవరు.. తన వల్ల విజ్జికి ఎందుకు ప్రాణాపాయం తలెత్తింది... పూర్వాశ్రమంలో వెట్రి ఎవరు.. జాన్ తో తన పోరాటం ఎంత వరకు వెళ్లింది అన్నది మిగతా కథ. కథనం-విశ్లేషణ: రీమేక్ సినిమాలనగానే జనాల్లో ఒక నిరాసక్తత వచ్చేసిన రోజులివి. ఏదైనా విదేశీ భాష నుంచి ఓ సినిమాను ఫ్రీమేక్ చేసినా.. చిన్న ప్రోమో చూసి నిమిషాల్లో దాని బండారం బయటపెట్టేస్తున్నారు. సోషల్ మీడియా పుణ్యమా అని రీమేక్ అయినా.. ఫ్రీమేక్ అయినా.. ఆ సినిమా విశేషాలన్నీ బయటికి వచ్చేస్తున్నాయి. అలాంటపుడు సినిమా చూడాలన్న ఆసక్తి ఏముంటుంది? ఇలాంటి టైంలో రాజకీయాల్లోకి అడుగుపెట్టే ముందు తమిళ టాప్ స్టార్ విజయ్ తన చివరి సినిమాగా చేసిన 'జననాయకుడు' కోసం తెలుగు హిట్ మూవీ 'భగవంత్ కేసరి' మీద ఆధారపడ్డారు. ఐతే ఉన్నదున్నట్లు తీస్తే ఈ రోజుల్లో కష్టం కదా.. అందుకే మన హరీష్ శంకర్ స్టయిల్లో రీమేక్ కాని రీమేక్ గా తీర్చిదిద్దారు ఈ చిత్రాన్ని. విలన్ ట్రాక్ మొత్తాన్ని మార్చేయడమే కాక.. దళపతి రాజకీయాలకు ఉపయోగపడేలా పొలిటికల్ కలర్ కూడా జోడించారు. కానీ ఆ వ్యవహారమంతా 'కేసరి' కథలో పూర్తిగా ఇమడలేదు. 'భగవంత్ కేసరి' కథను కొత్త కోణంలో చూపించే ప్రయత్నం చేశారు. యశ్ రాజ్ ఫిలిమ్స్ వాళ్ల స్పై సినిమాలను గమనిస్తే.. విలన్ పాత్రలన్నీ దాదాపుగా ఒకే రకంగా ఉంటాయి. నిజాయితీగా పని చేసినా సరే వ్యవస్థ వల్ల దెబ్బ తిన్న ఒక అధికారి.. సంఘ వ్యతిరేక శక్తిగా మారి దేశాన్నే దెబ్బ తీయడానికి ప్రయత్నిస్తుంటాడు. ఇందులో భాగంగా శత్రు దేశంతో చేతులు కలుపుతుంటాడు. 'భగవంత్ కేసరి' నుంచి భిన్నంగా నిలబెట్టడానికి అలాంటి పాత్రనే క్రియేట్ చేశాడు హెచ్.వినోద్ 'జననాయకుడు'లో. 'యానిమల్'తో ఎక్కడలేని పాపులారిటీ సంపాదించిన బాబీ డియోల్‌ను ఈ పాత్ర కోసం ఎంచుకున్నారు. ఒక అటవీ ప్రాంతంలో పని చేసే పోలీస్ అధికారి.. ఒక ఇంటర్నేషనల్ మాఫియా డాన్‌గా మారే బ్యాక్‌డ్రాప్‌ను చూపించారు. విలన్ ట్రాక్‌ను భారీ స్థాయిలో తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. 'భగవంత్ కేసరి' కథలో ఈ ట్రాక్‌ను జోడించడం ద్వారా కొత్త ట్రీట్‌మెంట్ ఇవ్వాలని దర్శకుడు ప్రయత్నించాడు. ఇదంతా ఒకెత్తయితే.. విజయ్ రాజకీయ ప్రయోజనం కోసం పెట్టిన సీన్లు- డైలాగులు మరో ఎత్తు. దళపతితో ఉన్న ఎమోషనల్ కనెక్షన్ వల్ల తమిళ ప్రేక్షకులకు అవి గూస్ బంప్స్ ఇస్తాయేమో కానీ.. మన ప్రేక్షకులకు మాత్రం అవి కథలో భాగంగా మరింత సహజంగా వచ్చి ఉంటే బాగుండేదనిపిస్తుంది. 'భగవంత్ కేసరి'కి చేసిన మార్పులు చేర్పులతో కథ కొత్త రూపాన్ని సంతరించుకుంది. కూతురు-పెంచిన తండ్రి మధ్య ఎమోషనల్ బాండింగ్‌కు ఇంకాస్త సమయం కేటాయించి ఉంటే బాగుండేది. విజయ్ పొలిటికల్ ఇమేజ్ బిల్డింగ్ మీద ఎక్కువ ఫోకస్ ఉండడంతో ఆ ఎమోషన్ కొంత తగ్గింది. కేవలం ఎలివేషన్ సీన్లు.. యాక్షన్ ఎపిసోడ్లను మాత్రం మాస్ ప్రేక్షకులను మెప్పించేలా తీర్చిదిద్దారు. విజయ్ అభిమానులు కూడా వీటితో కనెక్ట్ అవుతారు. విజయ్ పొలిటికల్ ఐడియాలజీని జనాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం కూడా సినిమాలో కనిపిస్తుంది. మూల కథను 'భగవంత్ కేసరి' నుంచే తీసుకున్నా.. దానికి భిన్నమైన ట్రీట్‌మెంట్ ఇవ్వాలని దర్శకుడు ప్రయత్నించాడు. ఈ మార్పులు తమిళ ప్రేక్షకులను ఎంత మేరకు మెప్పిస్తాయో చూడాలి. తెలుగు ప్రేక్షకులకు మాత్రం ఈ వెర్షన్‌తో కనెక్ట్ కావడం కొంత కష్టమే. నటీనటులు: విజయ్ నటన కంటే.. తన ట్రేడ్ మార్కు మేనరిజమ్స్.. స్టైల్ తో ఆకట్టుకున్నాడు. ఎలివేషన్ సీన్లలో బాగా హైలైట్ అయ్యాడు. యాక్షన్ ఘట్టాల్లోనూ ఆకట్టుకున్నాడు. తన లుక్ బాగుంది. పెర్ఫామెన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పుకునే స్థాయిలో ఏమీ లేదు. విజ్జి పాత్రలో మామిత బైజు జస్ట్ ఓకే అనిపిస్తుంది. తన పాత్రకు మొదట్లో బాగానే ప్రాధాన్యం కనిపిస్తుంది కానీ.. తర్వాత సైడ్ అయిపోయింది. పూజా హెగ్డే హీరోయిన్ అనే ఫీలింగ్ ఎంతమాత్రం అనిపించదు. తన పాత్రను సైడ్ క్యారెక్టర్లా మార్చేశారు. బాబీ డియోల్ చేసిన విలన్ పాత్ర కామెడీగా తయారైంది. అసలీ కథలో ఇలాంటి పాత్రను పెట్టాలని ఎలా అనిపించిందో అర్థం కాదు. డబ్బింగ్ వాయిస్ వల్ల ప్రకాష్ రాజ్ పాత్రతో ఏ కోశానా కనెక్ట్ కాలేం. నాజర్.. ప్రియమణి.. సునీల్.. ఇలా చాలామంది పేరున్న నటీనటులున్నా ఎవరికీ సరైన పాత్ర పడలేదు. సాంకేతిక వర్గం: 'జననాయకుడు' కోసం సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ బాగానే డ్యూటీ చేశాడు. బీజీఎం విషయంలో తన ప్రత్యేకతను చాటుకున్నాడు. ఎలివేషన్ సీన్లు.. యాక్షన్ ఘట్టాల్లో మోత మోగించాడు. పాటల పరంగా మాత్రం అతను నిరాశపరిచాడు. సత్యన్ సూర్యన్ ఛాయాగ్రహణం బాగుంది. నిర్మాణ విలువకు ఢోకా లేదు.

ఇక దర్శకుడు హెచ్.వినోద్ ఫిల్మోగ్రఫీలో 'జననాయకుడు' అట్టడుగున నిలుస్తుందనడంలో సందేహం లేదు. 'భగవంత్ కేసరి' లాంటి మంచి కథను అతను కంగాళీగా చేసి పెట్టాడు. ఐతే ఇందుకు పూర్తిగా అతణ్నే నిందించలేం. విజయ్ రాజకీయ ప్రయోజనాలకు తగ్గట్లుగా కథను మార్చాల్సిన పరిస్థితుల్లో అతడి క్రియేటివిటీ ఎందుకూ కొరగాకుండా పోయింది. పొలిటికల్ లీడర్‌గా విజయ్ ని ప్రొజెక్ట్ చేయడానికి పెట్టిన సీన్లు.. డైలాగుల విషయంలో అతణ్ని తప్పుబట్టలేం కానీ.. విలన్ ట్రాక్ ను మలిచిన విధానంలో మాత్రం వినోద్ కు పూర్తిగా మైనస్ మార్కులే పడతాయి. చివరగా: జననాయకుడు.. యాక్షన్ బాగున్నా..కథనం మెప్పించలేదు రేటింగ్: 2.25/5

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662